RNI No.TELTEL/2005/16755

ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in

Cell: 9292104449 / 9848384973
SRAVANTHI Enterprises
OFFSET PRINTERS

We undertake Printing of Daily News Papers

హైదరాబాద్ 01 నవంబర్ 2026 ఆదివారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:22 | సంచిక:132

ఇస్రో ప్రయోగం సక్సెస్..
శాస్త్రవేత్తలకు ప్రధాని మోదీ అభినందనలు

జీఎస్ఎల్వీ-ఎఫ్18 రాకెట్ ద్వారా ఎన్‌వీఎస్-03 ఉపగ్రహం విజయవంతం
ఇస్రో శాస్త్రవేత్తలు, ఇంజనీర్లకు ప్రధాని మోదీ అభినందనలు
స్వదేశీ నావిగేషన్ వ్యవస్థ 'నావిక్' బలోపేతం అవుతుందని వెల్లడి
కీలక సాంకేతికతల్లో ఆత్మనిర్భరతకు ఈ ప్రయోగం దోహదపడుతుందని వ్యాఖ్య

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ఖాతాలో మరో అద్భుత విజయం చేరింది. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీహరికోటలో ఉన్న సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్ నుంచి జీఎస్ఎల్వీ-ఎఫ్18 రాకెట్ ద్వారా ఎన్‌వీఎస్-03 ఉపగ్రహాన్ని విజయవంతంగా ప్రయోగించింది. ఈ ప్రయోగం విజయవంతం కావడంపై ప్రధాని నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. ఇస్రో శాస్త్రవేత్తలు, ఇంజనీర్ల బృందాన్ని ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్'లో ఒక పోస్ట్ చేశారు. "జీఎస్ఎల్వీ-ఎఫ్18 ద్వారా ఎన్‌వీఎస్-03 ఉపగ్రహాన్ని విజయవంతంగా ప్రయోగించిన ఇస్రో శాస్త్రవేత్తలు, ఇంజనీర్లకు నా అభినందనలు. మన స్వదేశీ నావిగేషన్ వ్యవస్థ 'నావిక్'ను బలోపేతం చేయడంలో ఈ ప్రయోగం ఒక ముఖ్యమైన ముందడుగు" అని ఆయన పేర్కొన్నారు. అత్యాధునిక సామర్థ్యాలతో కూడిన ఈ ఉపగ్రహం, కీలక సాంకేతికతల్లో దేశం ఆత్మనిర్భరత సాధించేందుకు మరింత దోహదపడుతుందని తెలిపారు. ప్రజలకు మెరుగైన నావిగేషన్ సేవలు అందించడంలో ఇది కీలక పాత్ర పోషిస్తుందని వివరించారు. మన అంతరిక్ష శాస్త్రవేత్తల అంకితభావం, నైపుణ్యం దేశానికి గర్వకారణంగా నిలుస్తున్నాయని మోదీ కొనియాడారు.

'నావిగేషన్ విత్ ఇండియన్ కాన్‌స్టలేషన్' (నావిక్) అనేది భారత్ సొంతంగా అభివృద్ధి చేసుకున్న ప్రాంతీయ నావిగేషన్ వ్యవస్థ. అమెరికాకు చెందిన జీపీఎస్ తరహాలోనే ఇది పనిచేస్తుంది. దేశ భద్రత, రవాణా, విపత్తుల నిర్వహణ, పౌర సేవలు వంటి అనేక రంగాల్లో కచ్చితమైన పొజిషనింగ్, టైమింగ్ సేవలను అందించడం దీని లక్ష్యం. ప్రస్తుతం ప్రయోగించిన ఎన్‌వీఎస్-03, నావిక్ కోసం రూపొందించిన రెండో తరం ఉపగ్రహాల్లో ఒకటి.

ఇది నావిక్ వ్యవస్థకు మరింత శక్తిని అందించి, దాని సేవలను మరింత విస్తృతం చేయనుంది. ఈ ఉపగ్రహంలో స్వదేశీ పరిజ్ఞానంతో తయారుచేసిన అటామిక్ క్లాక్ ఉండటం విశేషం.

0ఈ విజయంతో అంతరిక్ష రంగంలో స్వావలంబన దిశగా భారత్ మరో కీలక ముందడుగు వేసినట్లయింది.

భారతరత్న, మాజీ ప్రధానమంత్రి శ్రీమతి ఇందిరా గాంధీ వర్ధంతి సందర్భంగా న్యూఢిల్లీలోని శక్తి స్థల్ వద్ద పుష్పాంజలి ఘటించి నివాళు లర్పించిన టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ మంత్రి పొన్నం ప్రభాకర్ , ఎంపీ సురేష్ కుమార్ షెట్కర్



మాజీ ప్రధాని, భారతరత్న శ్రీమతి ఇందిరాగాంధీ గారి వర్ధంతి సందర్భంగా..
న్యూఢిల్లీలో "శక్తి స్థల్" వద్ద పుష్పాంజలి ఘటించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
ఏఐసీసీ అగ్రనాయకులు శ్రీమతి సోనియా గాంధీ, మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ,
కేసీ వేణుగోపాల్ తో కలిసి "శక్తి స్థల్" వద్ద నివాళులు అర్పించిన సీఎం.

సీఈసీపై ఇండియా కూటమి 'ప్రజా అభిశంసన'..
బీజేపీ గెలుపు చట్టవిరుద్ధమన్న రాహుల్

13.3 కోట్ల ఓట్లను జాబితా నుంచి తొలగించారని రాహుల్ గాంధీ ఆరోపణ
2024 లోక్‌సభ ఎన్నికలు చట్టవిరుద్ధమని, బీజేపీ గెలుపు అక్రమమని వ్యాఖ్య
ప్రభుత్వం దేశ ఆత్మపై దాడి చేస్తోందని మల్లికార్జున ఖర్గే విమర్శ
ఎన్నికల సంఘం పనితీరుకు వ్యతిరేకంగా 19 విపక్ష పార్టీల నిరసన

2024 లోక్‌సభ ఎన్నికల చట్టబద్ధతను ప్రశ్నిస్తూ కాంగ్రెస్ అగ్రనేత, ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ సంచలన ఆరోపణలు చేశారు. భారీ ఎత్తున ఓటర్ల జాబితా నుంచి పేర్లను తొలగించడం ద్వారా ఎన్నికల ప్రక్రియనే అపహాస్యం చేశారని, బీజేపీ ఎంపీలు అక్రమంగా లోక్‌సభలో అడుగుపెట్టారని ఆయన ధ్వజమెత్తారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా 'ఇండియా' కూటమి శనివారం నిర్వహించిన 'ప్రజా అభిశంసన' కార్యక్రమంలో రాహుల్ ఈ తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నివాసంలో ఏర్పాటు చేసిన ఈ మాక్ పార్లమెంట్ కార్యక్రమంలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ, "దేశవ్యాప్తంగా సుమారు 13.3 కోట్ల మంది ఓటర్ల పేర్లను జాబితా నుంచి తొలగించారు. ఇది మొత్తం ఓటర్లలో దాదాపు 15 శాతానికి సమానం. అనేక నియోజకవర్గాల్లో గెలుపు మార్జిన్ కేవలం 3 శాతం మాత్రమే ఉన్నప్పుడు, ఇంత పెద్ద సంఖ్యలో ఓట్లను తొలగించడం ఎన్నికల నిష్పాక్షికతపై తీవ్రమైన సందేహాలు రేకెత్తిస్తోంది" అని అన్నారు.

"2024 లోక్‌సభ ఎన్నికలు చట్టవిరుద్ధంగా జరిగాయని, బీజేపీ సభ్యులు అక్రమంగా పార్లమెంటులోకి ప్రవేశించారని స్వయంగా ఎన్నికల సంఘమే పరోక్షంగా అంగీకరిస్తోంది" అని రాహుల్ వ్యాఖ్యానించారు. అధికారంలో ఉన్న నాయకత్వం తనను కాపాడుతుందని సీఈసీ భావిస్తే పొరపాటని, ప్రజల ఆగ్రహాన్ని గమనించాలని హెచ్చరించారు. "మీరు ఓట్ల దొంగతనానికి సహకరిస్తూనే ఉండండి. కానీ వీధుల్లో ఉన్న ప్రజలు మీరు వారికి చేసిన ద్రోహాన్ని ఎప్పటికీ మర్చిపోరని నేను హామీ ఇస్తున్నాను" అని ఆయన అన్నారు.

ఈ కార్యక్రమానికి లోక్‌సభ మాజీ స్పీకర్ మీరా కుమార్ అధ్యక్షత వహించారు. సీఈసీకి వ్యతిరేకంగా లాంఛనప్రాయ ప్రజా అభిశంసనను ఖర్గే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం దేశ ఆత్మపైనే దాడి చేస్తోందని, పార్లమెంటులో మాట్లాడేందుకు ప్రతిపక్షాలకు కనీస అవకాశం ఇవ్వడం లేదని ఆరోపించారు. ఎన్నికల సంఘం పనితీరుకు వ్యతిరేకంగా తమ నిరసనను తెలియజేసేందుకే ఈ కార్యక్రమం నిర్వహించినట్లు ఇండియా కూటమి నేతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మొత్తం 19 రాజకీయ పార్టీల నేతలు పాల్గొన్నారు.

తెలంగాణలో బ్యాలెట్ ఎన్నికలకు సిద్ధమా?.. సీఎం రేవంత్‌కు బండి సంజయ్ సవాల్

వార్తా 4 లో

హైదరాబాద్‌లో నవంబర్ 1 నుంచి గ్రీన్ ట్యాంకర్ల సేవలు ప్రారంభం: సీఎస్ సంజయ్ జాజు

హైదరాబాద్, అక్టోబరు 31 నవంబర్ ఒకటో తేదీ నుంచి హైదరాబాద్‌లో గ్రీన్ ట్యాంకర్ల సేవలు ప్రారంభిస్తున్నట్లు తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ప్రకటించారు. తాగునీరు అవసరం లేని పనులకు శుద్ధి చేసిన నీటినే వాడాలని సూచించారు. ఈరోజు (శనివారం) రాష్ట్ర సచివాలయంలో హైదరాబాద్‌లో తాగునీటి సరఫరాపై సీఎస్ సంజయ్ జాజు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక అంశాలపై దిశానిర్దేశం చేశారు.

నీటి నాణ్యతపై నిరంతర పర్యవేక్షణకు సీఎస్ సంజయ్ జాజు ఆదేశాలు జారీ చేశారు. శుద్ధి చేసిన నీటి సరఫరాపై రోజువారీ నివేదిక ఇవ్వాలని ఎవీబోర్డీ ఎండీని ఆదేశించారు. మిషన్ భగీరథ అదనపు 40 MGD నీటి పథకం నవంబర్ 15వ తేదీ నాటికి పూర్తి చేయాలని మార్గనిర్దేశం చేశారు. విలీనమైన పట్టణ స్థానిక సంస్థలకు వచ్చే ఏడాది ఆగస్టు వరకు బల్క్ వాటర్‌ను సరఫరా చేయాలని సూచించారు. గ్రీన్ ట్యాంకర్ల ద్వారా డిమాండ్ మేరకు శుద్ధి చేసిన నీటిని సరఫరా చేయాలని ఆదేశించారు. గ్రీన్ ట్యాంకర్ల బుకింగ్ కోసం ప్రత్యేక మొబైల్ యాప్‌ను ఏర్పాటు చేస్తామని తెలిపారు. నీటి వినియోగాన్ని 20 శాతం తగ్గించడమే సేవ్ వాటర్ క్యాంపెయిన్ లక్ష్యమని సీఎస్ సంజయ్ జాజు పేర్కొన్నారు.

ప్రజాబలం

01 నవంబర్ 2026 ఆదివారం

ఇంట్లో మంట పెట్టనున్న ఎల్ నినో !

ఎల్ నినో. ఇపుడు ఈ పదమే భయపెడుతోంది. ఇప్పటిదాకా చూసిన ఎల్ నినో అన్నది ఒక ట్రైలర్ అయితే రానున్న ఆరేడు నెలలలో వచ్చేది సూపర్ ఎల్ నినో అంటున్నారు. అది అత్యంత భయంకరంగా ఉండబోతోంది అని చెబుతున్నారు. ఏకంగా ప్రతీ ఇంట్లో మంట పెట్టనుంది అని అంచనా వేసి మరీ చెబుతున్నారు. పొయ్యి కింద పొయ్యి మీద రెండింటికీ కలిపి ఒకేసారి కరవు తీసుకుని వచ్చే పవర్ ఫుల్ సూపర్ ఎల్ నినోని దేశం చూస్తోంది. ప్రత్యేకించి దక్షిణాది రాష్ట్రాలలో దీని ప్రభావం అత్యధికం అని చెబుతున్నారు. మరి ఇంతలా ఎల్ నినో వచ్చి మీద పడితే ఏమి చేయాలి అంటే చేయాల్సిన విధంగా పొదుపు చర్యలు ఎవరి మటుకు వారు పాటిస్తే తక్కువ నష్టంతో కష్టం తో బయటపడతామని దీని గురించి అంచనా వేస్తున్న వారంతా చెబుతున్నారు ఎల్ నినోతో పాటే వెంట వచ్చేవి నీటి కొరత, అలాగే అధిక వేడిమి, నిత్యావసర ధరలు భారీగా పెరుగుదల. ఇక ఒకదానితో ఒకటి లింక్ అయి ఉన్న ప్రతీ వస్తువూ ఎల్ నినో తో తీవ్రమైన ప్రభావమే చూపిస్తుంది అంటున్నారు. ముందుగా నీటి కొరత అయితే పట్టి పీడిస్తుంది అని అంటున్నారు. భూగర్భ జలాలు దారుణంగా పడిపోవడంతో తాగేందుకు కూడా నీరు ఉండని దారుణమైన పరిస్థితులను అంతా చూడబోతున్నారు అని చెబుతున్నారు. మరి ఈ సమయంలో ఏమి చేయాలి అంటే ఉన్న నీటిని ఇప్పటి నుంచే జాగ్రత్తగా పొదుపు చేసుకోవాలి. రెండు చెంబులు వాడాల్సిన చోట ఒక చెంబు వాడాలి. అలాగే పారబోయడం, నీటిని వృధా చేయడం అసలు చేయరాదు అని అంటున్నారు. ఇక తాగేందుకే నీటి కొరత ఉంటే పంటలకు ఎలా అన్నది పెద్ద ప్రశ్న. అలా పంటలు కూడా పూర్తిగా పండని స్థితి ఉంటుంది. దాంతో అందరూ తినే బియ్యానికి కూడా ఎక్కువగా కొరత ఏర్పడుతుందని చెబుతున్నారు. ఇప్పటికే ఎల్ నినో ప్రభావం అని చూపిస్తూ బియ్యం ధరలను ఎక్కడికక్కడ పెంచేస్తున్నారు. రానున్న ఆరు నెలలలో వీటి ధరలు ఇంకా ఎక్కువగా పెరగవచ్చు అని అంటున్నారు. దాంతో అన్నం ముద్ద ప్రతీదీ ఇపుడు అత్యంత విలువ కాబోతోంది. అనవసరంగా అన్నం పారేయడం అయితే చేయవద్దు అన్నది పెద్దల మాట. ఉన్న ముద్దను జగ్రత్తగా వాడుకోవడం మరో మంచి మాట. నిత్యావసరాలు అన్నీ కేవలం బియ్యం మాత్రమే కాకుండా నిత్యావసరాలు అన్నీ కూడా అత్యధిక ధరలు పలుకుతాయి. అది సామాన్యుడు కొనలేని స్థితికి వెళ్ళిపోతాయని అంటున్నారు. పప్పుల నుంచి వంట నూనెల నుంచి ఉల్లిపాయలు, చింతపండు, వంట గ్యాస్ నుంచి అన్నీ కూడా ఆకాశాన్ని అంటేలా ధరలు పెరిగిపోతాయని అంటున్నారు. ఇక కూరగాయల ధరలు ఇప్పటికే మార్కెట్ లో అదిరిపోతున్నాయి. ఇవి ఇంకా పెరిగి కిలో వంద రూపాయలు పై దాటినా ఆశ్చర్యం లేదని అంటున్నారు. విద్యుత్ కొరత : విద్యుత్ అన్నది ఎలా తయారవుతుంది అంటే నీటి నుంచే ఎక్కువ అన్నది తెలిసిందే. పైగా ఇది చవక అయినది కూడా. మరి నీరే లేని చోట విద్యుత్ ఉత్పత్తి భారీగా తగ్గిపోతుంది. దాంతో తీవ్రమైన విద్యుత్ కొరత ఏర్పడుతుంది అని అంటున్నారు. అందుకే ఇప్పటి నుంచే కరెంట్ ని కూడా పొదుపు చేయడం అలవాటు చేసుకోవాలి. ఎక్కువగా ఫ్యాన్లు ఏసీలు లైట్లూ వేసి వృధా చేస్తే రేపటి రోజున విద్యుత్ ఉండని నేపథ్యం ఉంటుంది. వస్తుంది కదా కరెంట్ అని ఈ రోజు ఖర్చు చేయడం కాదు తగ్గిస్తే అదే రేపటికి మనకు వెలుగు ఇస్తుంది అన్నది గుర్తెరగాలి. ఇక సూపర్ ఎల్ నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు అనవసర ఖర్చులను అదుపు చేయాలని సూచిస్తున్నారు. వేయి రూపాయలు ఖర్చు చేయాల్సిన చోట అయిదు వందలకే పరిమితం కావాలి. విలాసం ఏదో అవసరం ఏదో గుర్తించి ఆ విధంగా మసలుకోవాలని అంటున్నారు. ఎందుకంటే పెరిగే ధరలతో డబ్బు విలువ అమాంతం పడిపోతుంది. వందకు వచ్చేది రెండు వందలకు ఎగబాక వచ్చు. అపుడు నిత్యావసరాలకే ఎక్కువ బడ్జెట్ అవుతుంది. కాబట్టి చేతిలో డబ్బు ఉంచుకోవాలి. అది ప్రాణప్రదంగా ఖర్చు చేయాలని సూచిస్తున్నారు. అయితే సూపర్ ఎల్ నినో అని భయపడి వణికిపోయి ఇప్పుడే మొత్తం సరుకులు అన్నీ కొనేసి ఇంట్లో వేసుకున్నా కూడా అది కూడా తప్పే అవుతుంది. ఎందుకంటే డిమాండ్ అండ్ సప్లై చైన్ తో సాగే ప్రపంచంలో ఈ విధంగా తొందర పడితే మరింతగా ధరలు పెరిగి ఆ ప్రభావం ఇతర వస్తువుల మీద కూడా పడుతుంది. అందువల్ల జాగ్రత్తగా వ్యవహరిస్తే చాలు, అందరూ సూపర్ ఎల్ నినోని తట్టుకుని బయటపడతారని అంటున్నారు. వచ్చే ఆరు నెలలు గడిస్తే మాత్రం మంచి రోజులు వచ్చినట్లే అని అంటున్నారు. తస్మాత్ జాగ్రత్త.

జీహెచ్ఎంసీ తీరుపై హైకోర్టు ఆగ్రహం.. కూల్చివేతలపై ప్రశ్నల వర్షం

నిర్మాణాలపై జీహెచ్ఎంసీ వైఖరిపై హైకోర్టు ఆగ్రహం

అనుమతులిచ్చి, క్రమబద్ధీకరించి మీరే కూల్చేస్తారా? అని ప్రశ్న

మల్కాజ్‌గిరి డిఫెన్స్ హౌసింగ్ సొసైటీ కేసులో తీవ్ర వ్యాఖ్యలు

కౌంటర్లు దాఖలు చేసేందుకు జీహెచ్ఎంసీ, హైడ్రాకు తుది గడువు

'నిర్మాణాలకు అనుమతులు ఇవ్వడం, అక్రమ నిర్మాణాలను క్రమబద్ధీకరించడం మీరే చేసి, ఇప్పుడు మళ్లీ వాటిని కూల్చివేయమని అడగడమేంటి?' అంటూ గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ)పై తెలంగాణ హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. భవన నిర్మాణ అనుమతులు, కూల్చివేతల విషయంలో జీహెచ్ఎంసీ వైరుధ్యపూరిత వైఖరిని కోర్టు తీవ్రంగా తప్పుబట్టింది.

మల్కాజిగిరి మున్సిపాలిటీ పరిధిలో ఉన్న డిఫెన్స్ హౌసింగ్ కోఆపరేటివ్ సొసైటీకి సంబంధించిన వివాదంపై శుక్రవారం హైకోర్టులో విచారణ జరిగింది. ఈ సొసైటీ పరిధిలోని ప్లాట్లలో హైడ్రా చేపట్టిన కూల్చివేతలను సవాల్ చేస్తూ నర్సింహారెడ్డి తదితరులు పిటిషన్ దాఖలు చేశారు. మరోవైపు, సొసైటీకి చెందిన 6,039 చదరపు గజాల స్థలంలో జీహెచ్ఎంసీ డంపింగ్ యార్డ్ నిర్మించి, వాహనాలు పార్క్ చేస్తోందని సొసైటీ మరో పిటిషన్ వేసింది.

జస్టిస్ జి.ఎం. మొహియుద్దీన్ ఈ కేసును విచారించారు. తమ వద్ద అన్ని అనుమతులు ఉన్నాయని, లేఅవుట్ కూడా క్రమబద్ధీకరించారని పిటిషనర్ల తరఫు న్యాయవాది వాదనలు వినిపించారు. దీనిపై స్పందించిన న్యాయమూర్తి, లేఅవుట్లను క్రమబద్ధీకరించిన తర్వాత, అందులోని ప్రజా వినియోగ స్థలాలను కాపాడాలని రెవెన్యూ, హైడ్రా శాఖలకు జీహెచ్ఎంసీ లేఖలు రాయడమేమిటని ప్రశ్నించారు. తమ సొంత స్థలంలోని నిర్మాణాలను తొలగించుకోకుండా, రెవెన్యూ శాఖను ఆశ్రయించాల్సిన అవసరం ఏమొచ్చిందని జీహెచ్ఎంసీని నిలదీశారు.

ఈ నేపథ్యంలో, కౌంటర్లు దాఖలు చేసేందుకు జీహెచ్ఎంసీ, హైడ్రాలకు చివరి అవకాశంగా మూడు వారాల గడువు ఇస్తూ, తదుపరి విచారణను వాయిదా వేసింది.

ప్రభుత్వ బ్యాంకును ప్రైవేటుకు అప్పగిస్తారా?: ఐడీబీఐ డీల్‌పై కేటీఆర్ ఫైర్

బ్యాంకు ఆస్తుల విలువను ఉద్దేశపూర్వకంగా తగ్గిస్తున్నారని ఆరోపణ

రిజర్వ్ ధర కంటే తక్కువకు బిడ్లు వస్తే నిబంధనలు మార్చడంపై ప్రశ్నలు

ఉద్యోగుల ఆందోళనలను కేంద్రం ఎందుకు పట్టించుకోవడం లేదని మండిపాటు

ఐడీబీఐ బ్యాంకు ప్రైవేటీకరణ ప్రతిపాదనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ కేంద్ర ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలు, బ్యాంకులు జాతి సంపదని, వాటి విలువను ఉద్దేశపూర్వకంగా తక్కువ చేసి అమ్మజూపడంపై ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన ఎక్స్ (ట్విట్టర్) వేదికగా పలు కీలక ప్రశ్నలు సంధించారు.

"ఐడీబీఐ బ్యాంకు విలువను తక్కువగా అంచనా వేస్తున్నారనే నివేదికలు ఆందోళన కలిగిస్తున్నాయి. రిజర్వ్ ధర కంటే తక్కువకు బిడ్లు వచ్చినప్పుడు నిబంధనలు, మదింపు పద్ధతులను ఎందుకు మార్చారు? ఐడీబీఐ ఉద్యోగులు లేవనెత్తుతున్న ఆందోళనలను ఎందుకు పట్టించుకోవడం లేదు?" అని కేటీఆర్ ప్రశ్నించారు. హైదరాబాద్‌తో పాటు ఇతర ప్రధాన నగరాల్లో బ్యాంకుకు అత్యంత విలువైన భూములు, స్థిరాస్తులు ఉన్నాయని, వాటి విలువను సరిగ్గా లెక్కించారా? లేదా? అని నిలదీశారు. "ప్రతిష్ఠాత్మకమైన ప్రభుత్వ రంగ బ్యాంకును ప్రైవేటుపరం చేసే ముందు కేంద్ర ప్రభుత్వం దేశ ప్రజలకు స్పష్టమైన సమాధానాలు చెప్పాలి. ఇంత తొందర ఎందుకు?" అని ఆయన అన్నారు.

రాష్ట్రంలో ఎమర్జెన్సీ పాలన నడుస్తోంది: కాంగ్రెస్ సర్కార్‌పై హరీశ్ రావు ధ్వజం

మూసీ ప్రాజెక్టుపై ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్లకుండా బీఆర్ఎస్ నేతలను దిగ్బంధించారన్న హరీశ్

కరవుతో అల్లాడుతున్న రైతులను ఆదుకోవడం చేతకాని ప్రభుత్వమని విమర్శ

ప్రతిపక్షాల గొంతును ఎంతకాలం అణచివేస్తారని ప్రశ్న

మూసీ నది ప్రాజెక్టుపై ప్రజాభిప్రాయ సేకరణకు హాజరుకాకుండా బీఆర్ఎస్ నేతలను గృహనిర్బంధం చేశారని ఆ పార్టీ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు మండిపడ్డారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎమర్జెన్సీ తరహా పాలన సాగిస్తూ, ప్రతిపక్షాల గొంతు నొక్కుతోందని ఆయన తీవ్రస్థాయిలో విమర్శించారు.

హైదరాబాద్‌లోని వాలంతరిలో మూసీ ప్రాజెక్టుపై ప్రజాభిప్రాయ సేకరణ జరగాల్సి ఉంది. ఈ కార్యక్రమానికి హాజరుకావడానికి సిద్ధమైన మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఆమె కుమారుడు కార్తీక్ రెడ్డిలను పోలీసులు శ్రీనగర్ కాలనీలోని వారి నివాసంలో గృహ నిర్బంధం చేశారు. తెల్లవారుజాము నుంచే వారి ఇంటి వద్ద భారీగా పోలీసులు మోహరించి, బయటకు రాకుండా అడ్డుకున్నారు. ఈ ఘటనపై హరీశ్ రావు ఎక్స్ వేదికగా స్పందించారు. "కరవుతో రైతులు అల్లాడుతుంటే ఆదుకోవడం చేతకాని ప్రభుత్వం, రూ. 1.50 లక్షల కోట్లతో మూసీ ప్రక్షాళన పేరుతో కమిషన్ల కోసం ప్రాజెక్టులు చేపడుతోంది" అని ఆరోపించారు. పోలీసులను అడ్డం పెట్టుకుని ప్రజా వ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటూ, ప్రతిపక్షాల గొంతును ఎంతకాలం అణచివేస్తారని ప్రశ్నించారు. మూసీ ప్రక్షాళన ముసుగులో జరుగుతున్న దోపిడీ యత్నాలను తెలంగాణ సమాజం తిప్పికొడుతుందని, కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెబుతుందని హెచ్చరించారు.

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి కూడా అరెస్టులను ఖండించారు. ఇది అప్రజాస్వామిక చర్య అని, మూసీ పరీవాహక ప్రాంత ప్రజలకు అండగా నిలుస్తున్నందుకే తమను అక్రమంగా నిర్బంధించారని ఆరోపించారు. గృహనిర్బంధంలో ఉన్న బీఆర్ఎస్ నేతలను తక్షణమే విడుదల చేయాలని పార్టీ తరఫున డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ హయాంలో పటేల్‌కు దక్కాల్సిన గౌరవం దక్కలేదు.. అమిత్ షా తీవ్ర ఆరోపణలు

సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్‌కు దక్కాల్సిన గౌరవం కాంగ్రెస్ పాలనలో లభించలేదని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. ఆయనను పక్కనపెట్టి, ప్రజల జ్ఞాపకాల నుంచి చెరిపేసేందుకు కాంగ్రెస్ పార్టీ నిరంతరం ప్రయత్నించిందని ఆరోపించారు. పటేల్ 151వ జయంతి సందర్భంగా శనివారం ఢిల్లీలో నిర్వహించిన 'ఏక్తా రన్' కార్యక్రమంలో అమిత్ షా మాట్లాడారు.

ప్రధాని నరేంద్ర మోదీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో సర్దార్ పటేల్ స్మారకంగా ప్రపంచంలోనే ఎత్తైన విగ్రహమైన 'స్టాచ్యూ ఆఫ్ యూనిటీ'ని నిర్మించారని షా గుర్తుచేశారు. ఈ స్మారక నిర్మాణం ద్వారా పటేల్ సేవలు, ఆయన వ్యక్తిత్వాన్ని దేశవ్యాప్తంగా ప్రజలకు పరిచయం చేశారని పేర్కొన్నారు. దేశ సమైక్యతకు పటేల్ చేసిన కృషిని అమిత్ షా ప్రస్తావించారు. కేవలం 1,218 రోజుల్లోనే ఆయన అవిభాజ్య భారతదేశ నిర్మాణానికి పునాది వేశారని అన్నారు. పలువురు నాయకులు కలిసి జీవితకాలంలో సాధించలేని పనులను పటేల్ తక్కువ సమయంలోనే పూర్తి చేశారని వ్యాఖ్యానించారు. దేశాన్ని మాదకద్రవ్య రహితంగా మార్చేందుకు ప్రజలంతా సహకరించాలని షా పిలుపునిచ్చారు. 2029 డిసెంబర్ 31 నాటికి భారత్‌ను పూర్తిగా డ్రగ్స్ రహిత దేశంగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. 'నషా ముక్త్ భారత్' సాధనతోనే 'వికసిత్ భారత్' లక్ష్యం దిశగా ముందడుగు వేయగలమని అన్నారు. ఈ ఏడాది మార్చి 31 నాటికి నక్సలిజం నిర్మూలన దిశగా దేశం పురోగతి సాధించిందని పేర్కొన్నారు. మోదీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత పటేల్ జయంతిని జాతీయ ఐక్యతా దినోత్సవంగా నిర్వహిస్తున్నట్లు షా చెప్పారు. ఆర్టికల్ 370 రద్దుతో జమ్మూకశ్మీర్ పూర్తిస్థాయిలో భారత్‌లో విలీనమైందని, నక్సలిజం నిర్మూలనకు కూడా ప్రభుత్వం చర్యలు తీసుకుందని వివరించారు.

హైదరాబాద్‌లో హైడ్రా చర్యలు..

రామాంతపూర్ పెద్ద చెరువు వద్ద కూల్చివేతలు

రామాంతపూర్ పెద్ద చెరువు వద్ద నిర్మాణాల కూల్చివేత

చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నాయని తెలిపిన అధికారులు

40 ఏళ్లుగా పన్నులు కడుతున్నామంటున్న యజమానులు

అధికారుల చర్యలపై హైకోర్టును ఆశ్రయించిన బాధితులు

హైదరాబాద్ రామాంతపూర్‌లో ఉన్న పెద్ద చెరువు వద్ద ఉద్రిక్తత నెలకొంది. చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్న నిర్మాణాలను 'హైడ్రా' అధికారులు కూల్చివేశారు. చెరువు స్థలాన్ని ఆక్రమణల నుంచి కాపాడే చర్యల్లో భాగంగా ఈ కూల్చివేతలు చేపట్టినట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా ఎఫ్‌టీఎల్ ప్రాంతంలో ఉన్న ఓ భారీ

షెడ్డును అధికారులు తొలగించారు. అధికారుల చర్యలతో తాము తీవ్రంగా నష్టపోయామని ఆస్తుల యజమానులు ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు 40 ఏళ్లుగా తాము క్రమం తప్పకుండా పన్నులు, విద్యుత్ బిల్లులు చెల్లిస్తున్నామని వారు తెలిపారు. గత మూడు రోజులుగా అధికారులు సర్వేలు నిర్వహిస్తున్నారని, ఈ నేపథ్యంలోనే తాము హైకోర్టును ఆశ్రయించామని బాధితులు వివరించారు. ముందుగా చెరువు ఎఫ్‌టీఎల్ హద్దులను స్పష్టంగా నిర్ణయించాలని, ఆ తర్వాతే చట్టపరమైన తమ భూములపై చర్యలు తీసుకోవాలని వారు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. గతంలోనూ ఇదే చెరువు పరిధిలో కూల్చివేతలు చేపట్టి, కొంత భూమిని పునరుద్ధరణ పనుల కోసం అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

నరసింహ సేవలు మరువలేనివి పదవీ విరమణ కార్యక్రమం

35 ఏళ్ల సుదీర్ఘ సేవలకు ఘన వీడ్కోలు

నిజాయితీ, నిబద్ధతకు నరసింహ నిలువెత్తు నిదర్శనం

స్పోర్ట్స్ అథారిటీ ఉద్యోగుల ప్రశంసలు

హైదరాబాద్ అక్టోబర్31;తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ (SATG)లో సుమారు 35 ఏళ్ల పాటు డ్రైవర్‌గా సేవలందించి పదవీ విరమణ చేసిన నరసింహ సేవలు మరువలేనివని స్పోర్ట్స్ అథారిటీ ఉద్యోగులు కొనియాడారు. విధి నిర్వహణలో ఆయన ప్రదర్శించిన నిజాయితీ, నిబద్ధత, అంకితభావం సంస్థ ఉద్యోగులందరికీ ఎల్లకాలం గుర్తుండిపోతాయని పేర్కొన్నారు.

దాదాపు మూడున్నర దశాబ్దాల పాటు క్రీడా శాఖ మంత్రులు, ప్రిన్సిపల్ సెక్రటరీలు, చైర్మన్లు, మేనేజింగ్ డైరెక్టర్ల వద్ద డ్రైవర్‌గా పనిచేసిన నరసింహ, తన సుదీర్ఘ ఉద్యోగ ప్రస్థానంలో ఎలాంటి ఫిర్యాదులకు తావులేకుండా విధులు నిర్వహించారని సహోద్యోగులు గుర్తుచేసుకున్నారు. సెలవులకు కూడా పెద్దగా ఆస్కారం ఇవ్వకుండా విధుల పట్ల అంకితభావంతో పనిచేశారని ప్రశంసించారు.ప్రస్తుతం సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి రావడంతో డ్రైవర్ వృత్తి కొంత సులభతరమై ఉండవచ్చని, అయితే గతంలో ఆధునిక సాంకేతిక సదుపాయాలు అందుబాటులో లేని రోజుల్లో ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల వద్ద విధులు నిర్వహించడం ఎంతో బాధ్యతతో కూడుకున్న విషయమని ఉద్యోగులు పేర్కొన్నారు. అలాంటి పరిస్థితుల్లోనూ వివిధ హోదాల్లో పనిచేసిన అధికారుల వద్ద ఎలాంటి చిన్నపాటి ఫిర్యాదుకు కూడా అవకాశం ఇవ్వకుండా 35 ఏళ్ల పాటు నిరంతర సేవలందించడం అభినందనీయమన్నారు.

నరసింహ పదవీ విరమణ చేయడం ఒకవైపు సంతోషకరమైన విషయమే అయినప్పటికీ, ఇన్నేళ్లుగా తమతో కలిసి పనిచేసిన సహోద్యోగిని వీడ్కోలు పలకడం భావోద్వేగానికి

గురిచేస్తోందని ఉద్యోగులు తెలిపారు. ఆయన భవిష్యత్తు జీవితం ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ అథారిటీ ఇంజినీర్లు శ్రీనివాస్, దీపిక, అనూష, అసిస్టెంట్ డైరెక్టర్లు కేఆర్ భట్టర్, అశ్విని దద్పే, శాలిని, పీఆర్వో సురేష్ కాలేరు తదితరులు పాల్గొని నరసింహకు శుభాకాంక్షలు తెలిపారు.

నిర్ణీత ధరలకే బియ్యం విక్రయించాలి

మూడు రకాల బియ్యానికి గరిష్ఠ ధరల ఖరారు

దుకాణాల ఎదుట ధరల బ్యానర్లు ఏర్పాటు చేయాలి

అదనపు కలెక్టర్ డి. విజయేందర్ రెడ్డి హెచ్చరిక

మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం, అక్టోబరు 31: బియ్యం విక్రయాల్లో అధిక ధరలకు అడ్డుకట్ట వేసేందుకు పౌరసరఫరాల శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో వివిధ రకాల బియ్యానికి గరిష్ఠ విక్రయ ధరలను నిర్ణయించింది. వ్యాపారులు ఈ ధరలను తప్పనిసరిగా పాటించాలని జిల్లా అదనపు కలెక్టర్ (పౌరసరఫరాలు) డి. విజయేందర్ రెడ్డి స్పష్టం చేశారు.

పౌరసరఫరాల శాఖ కమిషనర్‌తో పాటు రాష్ట్ర, జిల్లా రైస్ మిల్లర్ల అసోసియేషన్ ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఈ మేరకు నిర్ణయాలు తీసుకున్నట్లు వెల్లడించారు. తెలంగాణ బీపీటీ బియ్యం కిలో రూ.66, తెలంగాణ సోనా బియ్యం రూ.74, తెలంగాణ శ్రీరామగోల్డ్ బియ్యం రూ.79గా గరిష్ఠ విక్రయ ధరలను ఖరారు చేసినట్లు తెలిపారు.

రైస్ మిల్లర్లు, ట్రేడర్లు, హోల్‌సేల్ డిపో నిర్వాహకులు, రిటైల్ వ్యాపారులు నిర్ణయించిన ధరలకు మించి విక్రయాలు జరపకూడదని స్పష్టం చేశారు. వినియోగదారుల నుంచి అదనపు ధరలు వసూలు చేస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించిన వ్యాపారులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

అదేవిధంగా ప్రతి హోల్‌సేల్, రిటైల్ బియ్యం

దుకాణం ఎదుట నిర్ణయించిన ధరలను స్పష్టంగా తెలియజేసే బ్యానర్‌ను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రజలకు న్యాయమైన ధరలకు బియ్యం అందేలా వ్యాపారులు సహకరించాలని అదనపు కలెక్టర్ కోరారు.

సీతక్క ప్రత్యేక చొరవతో హనుమాన్ ఆలయ నిర్మాణానికి నిధులు మంజూరు

ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 31 మంగపేట ప్రజల అవసరాలకు తక్షణమే స్పందించే నాయకురాలు మంత్రి సీతక్క పంచాయతీరాజ్ డైరెక్టర్ గుమ్మడి సోమయ్య ములుగు జిల్లా మంగపేట మండలంలోని తిమ్మంపేట ఆవాస ప్రాంతమైన బీసీ కాలనీ కూడలి వద్ద నిర్మించనున్న శ్రీ హనుమాన్ ఆలయ నిర్మాణం కోసం అనువైన స్థలాన్ని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు.ఆలయ నిర్మాణానికి మంత్రి సీతక్క ప్రత్యేక చొరవతో నిధులు మంజూరు కావడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ డైరెక్టర్ గుమ్మడి సోమయ్య మాట్లాడుతూ,ప్రజలకు ఏ సమస్య వచ్చినా తక్షణమే స్పందించి,వాటి పరిష్కారానికి బాధ్యతాయుతంగా కృషి చేసే ప్రజానాయకురాలు మంత్రి శ్రీమతి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క అని కొనియాడారు.

బీసీ కాలనీలో హనుమాన్ ఆలయ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరిన వెంటనే మంత్రి సీతక్క సానుకూలంగా స్పందించి నిధులు మంజూరు చేయడం అభినందనీయమని తెలిపారు.ప్రజల ఆధ్యాత్మిక అవసరాలను గుర్తించి ఆలయ నిర్మాణానికి సహకరించడం సంతోషకరమైన

విషయమని పేర్కొన్నారు.

గుడి అయినా.. బడి అయినా ప్రజలకు అవసరమైన చోట నిర్మించాలన్నదే మంత్రి సీతక్క ఆలోచనా విధానమని గుమ్మడి సోమయ్య అన్నారు.ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగడం మనందరికీ గర్వకారణమని పేర్కొన్నారు .ఈ ఆలయ నిర్మాణం పూర్తయితే బీసీ కాలనీ ప్రజలకు ఆధ్యాత్మికంగా ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని నాయకులు అభిప్రాయపడ్డారు.

ఈ కార్యక్రమంలో శ్రీ భద్రాచల సీతారామచంద్ర స్వామి దేవస్థానం డైరెక్టర్ పూజారి సురేందర్,ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు అయ్యోరి యానయ్య,మండల పార్టీ మాజీ అధ్యక్షులు మైల జయరాం రెడ్డి,బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు పెద్ది నరసింహారావు,ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు బసారీకారి హరికృష్ణ,ఏటూరు నాగారం ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ పగిడిపెల్లి వెంకటేశ్వర్లు,జిల్లా నాయకులు మాసిరెడ్డి వెంకటరెడ్డి,గ్రామ కమిటీ అధ్యక్షులు చిన్నపెల్లి రాంబాబు,గుండు నర్సయ్య, హనుమాన్ గుడి చైర్మన్ చిటమట రాజశేఖర్,తిమ్మంపేట గ్రామ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ముక్కెర రాజు,గడ్డం పరమేష్,బొంబోతుల మురళి,యగ్గడి అర్జున్,బోడ రామచంద్రం,ముక్కెర రజనీకాంత్,మల్లెల కమలాకర్,రెడ్డి పవన్,వడ్ల సంతోష్,కోటి రామ్,తాటి నరసింహారావు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

వైరా లయన్స్ క్లబ్ కుట్టు మిషన్ కేంద్రాన్ని పరిశీలించిన సతీష్ కుమార్ కోడె

ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం అక్టోబర్ 31:వైరా లోని 20వ వార్డులో వార్డు కౌన్సిలర్ ఉండు వరలక్ష్మి శ్యాంబాబు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కుట్టు మిషన్ కేంద్రాన్ని ఫస్ట్ వైస్ డిస్టిక్ గవర్నర్ సతీష్ కుమార్ కోడె శుక్రవారం రాత్రి పరిశీలించారు. కుట్టుమిషన్ కేంద్రంలో ఎంత మంది శిక్షణ తీసుకున్నారు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సతీష్ కుమార్ కోడె మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ముఖ్యంగా యువత సాధించలేనిది ఏమీ లేదని ఇంటిలో

ఒక్క మహిళ ఆర్థికంగా ఎదిగితే ఆ కుటుంబం అంతా కలకాలం సుఖసంతోషాలతో ఉంటుందని ఆయన అన్నారు వైరాలో కుట్టుమిషన్ కేంద్రంలో శిక్షణ తీసుకున్న మహిళలను యువతులను శిక్షణ వివరాలను అడిగి తెలుసుకున్నారు అనంతరం ఫాస్టెస్ట్ గవర్నర్ డాక్టర్ మురళీకృష్ణ మాట్లాడుతూ ఇప్పటి వరకు అనేక మందికి గత నాలుగు సంవత్సరాలుగా ఆర్థికంగా ఇబ్బంది పడుతూ కుటుంబ భారం మోయలేకపోతున్న శిక్షణ పొందిన మహిళలకు రాయితీతో కూడిన కుట్టు మిషన్లు అందించామని 20వ వార్డులో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కుట్టు మిషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేసి ప్రతి ఆరు నెలలకు ఒకసారి విడతలవారీగా శిక్షణ అందించి వారికి కుట్టుమిషన్లు అందించడానికి చొరవ తీసుకుంటున్నామని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు ఈ కేంద్రంలో శిక్షణ పొందిన మహిళలు యువతులు గత ఆరు నెలలుగా శిక్షణ పొందుతున్నారని వారికి త్వరలో శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్స్ అందిస్తామని ఆయన తెలిపారు ఈ సందర్భంగా ఫాస్ట్ డిస్టిక్ గవర్నర్ యానాలమోహన్ రెడ్డి మాట్లాడుతూ కుట్టుమిషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేసి వారికి శిక్షణ ఇచ్చి వారి సొంతంగా ఆర్థికంగా బలపడేలా శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయటం పట్ల కౌన్సిలర్ వుండ్రు వరలక్ష్మి శ్యాంబాబులను ఆయన అభినందించారు ఈ కార్యక్రమంలో ఎల్సిఐఎఫ్ కోఆర్డినేటర్ లగడపాటి ప్రభాకర్ రావు జి ఇ టీ కొ ఆర్డినేటర్ వుండ్రు శ్యామ్ బాబు జోన్ చైర్మన్ తోటకూర శ్రీకాంత్ జిల్లా క్యాబినెట్ జాయింట్ ట్రెజరర్ పెనుగొండ ఉపేందర్ రావు క్లబ్స్ కోఆర్డినేటర్ తూ మ్ములూరి మురళి రెడ్డి జిల్లా కమిటీ సభ్యులు నూకల ప్రసాదరావు వైరా లయన్స్ క్లబ్ అధ్యక్షులు కొల్ల రాంబాబు ఉపాధ్యక్షులు ఏపూరి రాజారావు మరికంటి రాంగోపాల్ గంగవరపు కిషన్ రాయ్ అవని క్లబ్ అధ్యక్షురాలు గద్దె నీరజ సెక్రెటరీ సుగ్గల మాధవి రాయల విజయలక్ష్మి నాళ్ల నాగమల్లేశ్వరి వనమా సునీత గుడ్ల శేషు ఈడుపుగంటి రత్నకుమారి వడ్లమూడి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు

పాము కాటుతో గృహిణి మృతి

ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 31 మంగపేట మంగపేట మండల కేంద్రంలోని పూరేడుపల్లి గ్రామానికి చెందిన కొప్పుల విజయలక్ష్మి గృహిణి ఇంట్లో బియ్యం తీసుకోవడానికి బియ్యం డబ్బా వద్దకు వెళ్ళగా పాము కాటు వేయడం జరిగింది వెంటనే బయటికి వచ్చి బంధువులకు చెప్పడంతో వెంటనే ఏటూరునాగారం ఏరియా ఆసుపత్రికి తరలించారు చికిత్స పొందుతూ మృతి చెందినట్లు బాధ్యులు తెలిపారు విజయలక్ష్మి కి ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నట్లు బంధువులు తెలుపుతున్నారు. విజయలక్ష్మి మృతితో పూరేడుపల్లి గ్రామం అంత దుఃఖ సాగరంలో మునిగి పోయింది

సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళనలు ఉధృతం

నల్ల బ్యాడ్జీలతో తెలంగాణ ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయుల నిరసన

ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం అక్టోబర్ 31: దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ పెనుబల్లి మండలం టేకులపల్లిలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలఉపాధ్యాయులు శుక్రవారం నిరసన చేపట్టారు. పాఠశాల విరామ సమయంలో ఉపాధ్యాయులందరూ నల్ల బ్యాడ్జీలు ధరించి విధులు నిర్వహిస్తూ తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్లపై ప్రభుత్వం వెంటనే సానుకూలంగా స్పందించాలని, లేనిపక్షంలో సమస్యలు పరిష్కారమయ్యే వరకు ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ప్రధానడిమాండ్లు: ఉపాధ్యాయులందరికీ పాత పెన్షన్ విధానాన్ని (ఓ పి ఎస్) వర్తింపజేయాలి. ప్రభుత్వ ఖజానా నుంచి 010 పద్దు ద్వారానే వేతనాలు చెల్లించాలి. పీజీటీలకు జూనియర్ లెక్చరర్ (జేఎల్) సమాన పే స్కేలును అమలు చేయాలి. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న డీఏ బకాయిలను తక్షణమే విడుదల చేయాలి. సీపీఎస్ మ్యాచింగ్ గ్రాంట్‌ను వెంటనే మంజూరు చేయాలి. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న ఇతర దీర్ఘకాలిక సమస్యలను సమగ్రంగా పరిష్కరించాలి.

తెలంగాణలో బ్యాలెట్ ఎన్నికలకు సిద్ధమా?..

సీఎం రేవంత్‌కు బండి సంజయ్ సవాల్

హైదరాబాద్, అక్టోబరు 31 తెలంగాణలో బ్యాలెట్ పేపర్ ద్వారా ఎన్నికలకు వెళ్తే బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు రాజీనామా చేసేందుకు సిద్ధమని కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ సవాల్ చేశారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సిద్ధమైతే తాను, తమ పార్టీ కేంద్ర నాయకత్వాన్ని ఒప్పిస్తామని స్పష్టం చేశారు. ఈనాటి ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (సర్) ప్రక్రియతోనే దేశంలో కాంగ్రెస్ అధికారం కోల్పోయిందా..? అని ప్రశ్నించారు. తమిళనాడులో 60 ఏళ్ల నుంచే కాంగ్రెస్ అడ్రస్ లేకుండా పోయిందని ప్రస్తావించారు. ఈరోజు (శనివారం) హైదరాబాద్‌లోని బీజేపీ ప్రధాన కార్యాలయంలో మీడియాతో బండి సంజయ్ మాట్లాడారు. మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు 2004లో చనిపోతే ఆయన ఓటు ఇంకా ఉందని, తొలగించాలా? వద్దా అని ప్రశ్నించారు. ఈ దేశం కాని వాళ్లు అక్రమంగా వలస వచ్చి ఓటర్‌గా నమోదు చేసుకుని ఈ దేశ రాజకీయాలను శాసిస్తామంటే ఊరుకోవాలా అని ధ్వజమెత్తారు. పశ్చిమ బెంగాల్‌లో 50 ఏళ్లుగా అధికారంలోకి ఎందుకు రాలేదని ప్రశ్నించారు.

హార్దిక్ ట్రేడ్ డీల్: ఆ ప్లేయర్ లేకపోతే ఎంఐ ఒప్పుకోదు..

ఆ రాష్ట్రాల్లో ఓడిపోయారు..

సిక్కింలో 1975లో రాష్ట్ర హోదా పొందినప్పటి నుంచి ఒక్కసారి కూడా అధికారంలోకి కాంగ్రెస్ రాలేదని బండి సంజయ్ గుర్తుచేశారు. యూపీలో 37 ఏళ్లుగా, బీహార్‌లో 36 ఏళ్లుగా, త్రిపురలో 34 ఏళ్లుగా, గుజరాత్‌లో 31 ఏళ్లుగా కాంగ్రెస్ అధికారంలోకి రానేలేదని స్పష్టం చేశారు. ఒడిశా, జార్ఖండ్‌లో 26 ఏళ్లుగా, మధ్యప్రదేశ్, నాగాలాండ్‌లో 23 ఏళ్లుగా, గోవాలో 14 ఏళ్లుగా కాంగ్రెస్‌కు అధికారం అందని ద్రాక్షగానే మిగిలిపోయిందని విమర్శించారు. ఆంధ్రప్రదేశ్, హరియాణా, మహారాష్ట్రాలో 12 ఏళ్లుగా, అరుణాచల్ ప్రదేశ్, అస్సాంలో పదేళ్లుగా, మణిపూర్, ఉత్తరాఖండ్‌లో 9 ఏళ్లుగా హస్తం పార్టీ అధికారంలోనే లేదని చెప్పుకొచ్చారు. మేఘాలయ, మిజోరాంలో 8 ఏళ్లుగా, పంజాబ్‌లో 4 ఏళ్లుగా కాంగ్రెస్ అధికారంలోకి ఎందుకు రాలేదని ప్రశ్నల వర్షం కురిపించారు. 2014 నుంచి కాంగ్రెస్ ఓడిపోతునే ఉందని అన్నారు.

ఓడిపోతే ఈవీఎంలపైనా కాంగ్రెస్ విష ప్రచారం..

కేరళం, తెలంగాణ, కర్ణాటకలో ఈ ఎన్నికల కమిషన్ ఆధ్వర్యంలో ఎలక్షన్ జరిగితే కాంగ్రెస్ గెలిచిందని బండి సంజయ్ ప్రస్తావించారు. ఓడిపోతే ఈవీఎంలపైనా విష ప్రచారం చేయడం కాంగ్రెస్‌కే చెల్లిందని ధ్వజమెత్తారు. ఈవీఎంలతో తొలిసారి ఎన్నికలకు వెళ్లిందే రాజీవ్ గాంధీ హయాంలో అని గుర్తుచేశారు. బ్యాలెట్ ద్వారా జరిగిన ఎన్నికల్లోనూ కాంగ్రెస్ ఓడిపోయిందని చెప్పారు. అస్సాంలో బ్యాలెట్‌తో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓడిపోయిందని తెలిపారు. తెలంగాణలో బ్యాలెట్ ద్వారా జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ ఓడిపోయిందని అన్నారు. నిన్నటికి నిన్న 4 రాష్ట్రాల్లో బ్యాలెట్‌తో జరిగిన 28 ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ చిత్తుగా ఓడిపోయిందని ఎద్దేవా చేశారు. ఈ విషయంలో కాంగ్రెస్ ఏం సమాధానం చెబుతుందని బండి సంజయ్ ప్రశ్నించారు.

బెజవాడలో త్రిముఖ పోరు

విజయవాడ, అక్టోబరు 31, ఆంధ్రప్రదేశ్ రాజకీయాలకు కేంద్రబిందువైన విజయవాడ కార్పొరేషన్ మేయర్ ఎన్నిక రోజురోజుకూ ఉత్కంఠభరితంగా మారుతోంది. అధికార ఎన్డీయే కూటమి ఉమ్మడి అభ్యర్థిగా వంగవీటి రాధాకృష్ణ బరిలో నిలవగా, ప్రధాన ప్రతిపక్షం వైఎస్సార్‌సీపీ తరఫున మాజీ మేయర్ రాయన భాగ్యలక్ష్మి మరోసారి పోటీ పడుతున్నారు. అయితే, ఈ ద్విముఖ పోరును అనూహ్యంగా త్రిముఖ సమరంగా మారుస్తూ మాజీ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు స్వతంత్ర అభ్యర్థిగా రంగానికి దిగడం బెజవాడ రాజకీయ వాతావరణాన్ని ఒక్కసారిగా వేడెక్కించింది. వామపక్షాలు , కాంగ్రెస్ పార్టీల ఐక్య మద్దతుతో ఆయన నిర్వహిస్తున్న ప్రచారం సాంప్రదాయ రాజకీయ పార్టీల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తోంది. మాజీ సీపీగా బెజవాడ నగరంపై పరిపూర్ణమైన పట్టు, శాంతిభద్రతలపై స్పష్టమైన అవగాహన ఉన్న ఏబీ వెంకటేశ్వరరావు తన ప్రచారాన్ని ప్రత్యేక శైలిలో నిర్వహిస్తున్నారు. అవినీతి రహిత నగర పాలన, పన్నుల భారం తగ్గించడం, లంచాలు లేని సేవలు అనే నినాదాలతో మేధావులు, మధ్యతరగతి , విద్యాధికుల ఓటు బ్యాంక్‌ను ఆకర్షించేందుకు ఆయన తీవ్రంగా శ్రమిస్తున్నారు. వామపక్ష బలానికి తోడు కాంగ్రెస్ పార్టీ మద్దతు లభించడం, అలాగే సీనియర్ ఐపీఎస్‌గా ఆయనకున్న నిష్కళంకమైన ఇమేజ్ ఏబీవీకి ప్రధాన బలంగా మారాయి. ఏ రాజకీయ పార్టీ బంధాలు లేకుండా, కేవలం విజయవాడ సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా ఆయన విసురుతున్న సవాళ్లు ప్రధాన పార్టీల అభ్యర్థులకు మింగుడుపడటం లేదు. అయితే, ఎన్డీయే కూటమి అభ్యర్థిగా బరిలో ఉన్న వంగవీటి రాధాకృష్ణకు బలమైన ప్రజాదరణ, వంగవీటి కుటుంబానికి నగరంలో ఉన్న అభిమానుల బలగం పెద్ద ప్లస్ పాయింట్. కూటమి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు తనను గెలిపిస్తాయని ఆయన ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఆసక్తికరమైన విషయమేమిటంటే.. రాధాకృష్ణ, ఏబీ వెంకటేశ్వరరావు ఇద్దరూ ఒకరిపై ఒకరు వ్యక్తిగత విమర్శలు చేసుకోకుండా అత్యంత హుందాతనంతో ప్రచారం సాగిస్తుండటం ఈ ఎన్నికల ప్రత్యేకతగా నిలిచింది. రాధా సైతం నగరాభివృద్ధికి ఏబీవీ సలహాలు తీసుకుంటా అని ప్రకటించగా, ఏబీవీ కూడా మాది భావజాల పోరాటమే తప్ప వ్యక్తిగతం కాదని స్పష్టం చేశారు. మరోవైపు వైఎస్సార్‌సీపీ అభ్యర్థి రాయన భాగ్యలక్ష్మి బిసి సామాజిక వర్గ సమీకరణాలు, తమ హయాంలో చేసిన అభివృద్ధి పనులనే నమ్ముకుని ముందుకు వెళుతున్నారు. అయితే, ఓట్ల చీలిక ఎవరికి లాభిస్తుందనేది ఇప్పుడు అసలు ప్రశ్నగా మారింది. నాన్-పొలిటికల్, న్యూట్రల్ ఓటర్లు, మార్పు కోరుకునే వర్గాలు గనక ఏబీవీ వైపు మొగ్గుపడితే కూటమి, వైసీపీ ఓట్ బ్యాంకుల్లో భారీగా గండిపడే అవకాశం ఉంది. బెజవాడ ఓటర్లు ఎప్పుడూ ఊహించని సంచలన తీర్పులకు వేదికగా నిలుస్తారనే చరిత్ర ఉండటంతో, ఏబీవీ గెలుపు అవకాశాలను రాజకీయ విశ్లేషకులు తోసిపుచ్చలేకపోతున్నారు. వంగవీటి రాధా పవర్ కేడర్, రాయన భాగ్యలక్ష్మి పార్టీ క్యాడర్ బలానికి ఎదురీదుతూ ఏబీ వెంకటేశ్వరరావు సృష్టిస్తున్న ఈ ట్రెండ్ బెజవాడ రాజకీయాల్లో కొత్త చరిత్రకు పునాది వేస్తోంది. సంప్రదాయ పార్టీల ధనప్రవాహం, కుల సమీకరణలను దాటుకుని, వామపక్షాల సంపూర్ణ సహకారంతో ఏబీవీ నిజంగానే బెజవాడ పీఠంపై సంచలనం సృష్టిస్తారా లేక కూటమి-వైసీపీల హోరాహోరీ మధ్య స్వతంత్ర హోదాకే పరిమితమవుతారా అనేది పోలింగ్ ఫలితాలు తేల్చనున్నాయి.

కారులో మంటలు..ప్రయాణికులు క్షేమం

రంగారెడ్డి బాటసింగారం గ్రామ పరిధిలోని విజయవాడ జాతీయ రహదారిపై ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ వద్ద విజయవాడ నుండి హైదరాబాదుకు వస్తున్న హుండై ఐ10 కార్లు అకస్మాత్తుగా మంటలు చేలరేగాయి . క్షణాల్లో మంటలు కారు మొత్తం వ్యాపించడంతో అది గమనించిన డ్రైవింగ్ చేస్తున్న తాడేపల్లి ప్రవీణ్ వృత్తిరీత్యా ఆంధ్రప్రదేశ్ సచివాలయంలో ఏఎస్ఓ కారు ఆపేసాడు.

రాఘవేంద్రరావు మరదలు, జగపతిబాబు చెల్లెలు..

మేయర్ అభ్యర్థి కోవెలమూడి లక్ష్మీ అపర్ణ

గుంటూరు, అక్టోబరు 31, గుంటూరు కార్పొరేషన్ మేయర్ అభ్యర్థి కోవెలమూడి లక్ష్మీ అపర్ణ కుటుంబ నేపథ్యంపై ఆసక్తికర సమాచారం వెలుగుచూసింది. ఆమె విజయాన్ని కాంక్షిస్తూ ఇద్దరు సినీ ప్రముఖులు వీడియో సందేశాలు విడుదల చేశారు. ఆ ఇద్దరూ లక్ష్మీ అపర్ణకు దగ్గర బంధువులుగా చెబుతున్నారు. లక్ష్మీ అపర్ణను గుంటూరు మేయరుగా గెలిపించాలని దర్శకేంద్రుడు రాఘవేంద్రరావు, ప్రముఖ హీరో జగపతిబాబు ప్రత్యేకంగా వీడియోలు విడుదల చేశారు. రాఘవేంద్రరావు, మేయర్ అభ్యర్థి లక్ష్మీ అపర్ణ భర్త కోవెలమూడి రవీంద్ర సోదరులుగా చెబుతున్నారు. అదేవిధంగా లక్ష్మీ అపర్ణ తనకు సోదరి అంటూ స్వయంగా జగపతిబాబు వెల్లడించారు. గుంటూరు టీడీపీ నేత, మాజీ మేయర్ రవీంద్ర అలియాస్ నాని రాజకీయాల్లో చాలా సీనియర్. అయినప్పటికీ ఆయన బంధుత్వంపై గుంటూరు వాసులకు తప్ప రాష్ట్రంలో ఇతర ప్రాంతాల వారికి తెలియదు. తొలిసారిగా ప్రత్యక్ష ఎన్నికల పోరులో రవీంద్ర కుటుంబం దిగడంతో ఆయన బంధువులు బయటకు వస్తున్నారు. కోవెలమూడి లక్ష్మీ అపర్ణను గెలిపించాలని కోరుతున్నారు.

ఇందులో సినీ ప్రముఖులు అయిన రాఘవేంద్రరావు, జగపతిబాబు విడుదల చేసిన వీడియోలు తెగ వైరల్ అవుతున్నాయి గుంటూరు ప్రజలకు విన్నపం నా చెల్లి లక్ష్మీ అపర్ణ మేయరుగా పోటీ చేస్తున్నారని జగపతిబాబు విడుదల చేసిన వీడియో ఆకట్టుకుంటోందని చెబుతున్నారు. ప్రజలు చాలా తెలివైన వారని, ఎవరిని గెలిపించాలో వారికి బాగా తెలుసు అన్న జగపతిబాబు గత ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించినట్లుగానే లక్ష్మీ అపర్ణను గెలిపించాలని కోరారు. నా చెల్లికి మంచి మనసు ఉంది. సమర్థురాలు అంటూ ఆయన కితాబునిచ్చారు. ఇక జగపతిబాబు చెల్లెలుగా లక్ష్మీ అపర్ణను పరిచయం చేయడంతో వారి మధ్య బంధుత్వంపై పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది ప్రముఖ నిర్మాత వీబీ రాజేంద్రప్రసాద్ కుమారుడైన జగపతిబాబుకు ఇద్దరు సోదరులు మాత్రమే ఉన్నారని సమాచారం. అయితే లక్ష్మీ అపర్ణ కుటుంబంతో దగ్గర సంబంధం ఉండటం, బంధుత్వం కారణంగా ఆమె సోదరి అవుతారని అంటున్నారు. మొత్తానికి గుంటూరు మేయరు అభ్యర్థి కోవెలమూడి లక్ష్మీ అపర్ణకు మద్దతుగా సినీ ప్రముఖులతోపాటు పారిశ్రామిక, వ్యాపార దిగ్గజాలు సైతం బయటకు వస్తుండటం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోందని అంటున్నారు. శుక్రవారం సాయంత్రంతో ఎన్నికల ప్రచారం ముగియగా, సినీ ప్రముఖులు విడుదల చేసిన వీడియోలు మాత్రం సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. దీంతో గుంటూరు కూటమి మేయర్ అభ్యర్థి లక్ష్మీ అపర్ణకు డిజటల్ ప్రచారం బాగా జరుగుతోందని విశ్లేషిస్తున్నారు.

రాజకీయాల్లో బంధువులు...

వేర్వేరు పార్టీల్లో కుటుంబసభ్యులు

విజయవాడ, అక్టోబరు 31, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల సమరం రక్త సంబంధీకులు, బంధువుల మధ్య హోరాహోరీ పోరుగా రూపాంతరం చెందింది. రాజకీయ సమీకరణాలు, రిజర్వేషన్ల కేటాయింపుల పుణ్యమాని ఒకే కుటుంబానికి చెందిన వారు వేర్వేరు జెండాలు పట్టుకుని ఒకరిపై ఒకరు పోటీకి సిద్ధమవడంపై ఆసక్తికర చర్చ జరుగుతోంది. ఎన్నికల వేళ పల్లెల్లో నెలకొన్న ఈ విచిత్రమైన వాతావరణం ఓటర్లతో పాటు స్థానికంగా హాట్ టాపిక్ అవుతోంది. మహిళా రిజర్వేషన్ అయిన చోట భార్యాభర్తలు కలిసి పోటీ చేస్తుంటే, మరికొన్ని చోట్ల ఒకే కుటుంబం నుంచి ఒకే స్థానానికి పోటీపడుతూ పదవి తమ గుమ్మం దాటకుండా చూపుకుంటున్నారని వ్యాఖ్యానిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి స్థానాలు పదుల సంఖ్యలో ఉన్నట్లు చెబుతున్నారు. శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస మండలంలోని కలివరం ఎంపీటీసీ స్థానానికి ఒకే కుటుంబానికి చెందిన తోడికోడళ్లు బుద్దేపు లక్ష్మి (తెలుగుదేశం పార్టీ), బుద్దేపు కూరమ్మ (వైఎస్సార్సీపీ) నామినేషన్లు దాఖలు చేశారు. ఒకప్పుడు ఇదే స్థానం కోసం అన్నదమ్ములు తలపడగా, ఇప్పుడు మహిళలకు రిజర్వు చేయడంతో తమ భార్యలను రణరంగంలోకి దించారని చెబుతున్నారు. ఇదే రీతిలో నెల్లూరు జిల్లా పొదలకూరు మండలంలోని మొగళ్లూరు ఎంపీటీసీ స్థానం ఎస్సీ మహిళకు రిజర్వ్ అయింది. ఈ స్థానం కోసం తోడికోడళ్లు అయిన కూకట్ల శంకరమ్మ (టీడీపీ), కూకట్ల ఉష (వైఎస్సార్సీపీ) సర్వశక్తులు ఒడ్డుతున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో వార్డులు ఎంపీటీసీ స్థానాల విభజన తీరు కుటుంబాల మధ్య రాజకీయ విభేదాలకు ఆజ్యం పోసింది. ఉమ్మడి కుటుంబాల్లో కలిసిమెలిసి ఉండే సొంత అన్నదమ్ములు, బావబావమరుదులు సైతం వేర్వేరు పార్టీల కండువాలు కప్పుకుని బరిలో నిలుస్తున్నారు. ఉదయం లేచింది మొదలు రాత్రి వరకు ఎవరి పార్టీ వ్యూహాల్లో వారు బిజీగా ఉంటూ, బహిరంగ ప్రచారంలో ఒకరిపై ఒకరు విమర్శలు సంధించుకుంటున్న దృశ్యాలు అందరినీ ఆశ్చర్యపరుస్తున్నాయి. ఇక కాకినాడ జిల్లా రౌతులపూడిలో అయితే ఒకే కుటుంబం నుంచి భార్యాభర్తలు పైలా అశోక్, సౌజన్యలు వేర్వేరు ఎంపీటీసీ స్థానాల నుంచి టీడీపీ అభ్యర్థులుగా పోటీ చేస్తుండగా, అదే కుటుంబానికి చెందిన లోవ కళ్యాణి (సౌజన్య ఆడపడుచు వరుస) జెడ్పీటీసీ స్థానానికి బరిలో నిలిచి వినూత్న రాజకీయం నడిపిస్తున్నారు. మరోవైపు ఉమ్మడి గోదావరి జిల్లాలోని కడియం మండలంలో ఎంపీపీ పోరు రాజకీయంగా పీక్స్‌కి చేరింది. ఇక్కడ ఎంపీపీ పదవి జనరల్ మహిళకు కేటాయించడంతో ప్రముఖ నర్సరీ రైతులు తమ సకుటుంబంగా ఎన్నికల బరిలోకి దిగారు. కూటమి తరఫున బోడపాటి గోపాలకృష్ణ భార్య పుణ్యవతి, వైసీపీ తరఫున తాడాల విష్ణు చక్రవర్తి భార్య రాజరాజేశ్వరి ఈ పదవి కోసం పోటీపడుతున్నారు. కేవలం భార్యలే కాకుండా, ఆ భర్తలు కూడా వేర్వేరు ఎంపీటీసీ స్థానాల నుంచి పోటీ చేస్తుండటంతో ఈ కడియపులంక రాజకీయం రాష్ట్రవ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారింది. గ్రామాల్లో సొంత వాళ్ల పంచాయితీ నడుస్తుండటంతో ఓటర్లు డైలమాలో పడుతున్నారని చెబుతున్నారు. బంధుత్వానికి పెద్దపీట వేసి ఎవరికో ఒకరికి ఓటేయాలా? లేక తాము నమ్మిన పార్టీ సిద్ధాంతాలు, అభ్యర్థుల సమర్థతను బట్టి తీర్పునివ్వాలా? అని తేల్చుకోలేక తలలు పట్టుకుంటున్నారని అంటున్నారు. ఎన్నికల పోరు ముగిసి, ఫలితాలు వెలువడిన తర్వాత గెలుపు ఓటముల ప్రభావం ఈ కుటుంబాల బాంధవ్యాలపై ఎలాంటి ప్రభావం చూపుతుందనేది సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

కామినేని ఆసుపత్రిలో రోగి బంధువుల అందోళన

హైదరాబాద్ బొగ్గులకుంటలోని కామినేని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న 62 ఏళ్ల రోజమ్మకు జరిగిన వైద్య చికిత్సపై ఆమె కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల 26వ తేదీన ఆసుపత్రిలో చేరిన సమయంలో రోజమ్మ ఆరోగ్యంగా ఉన్నారని, స్వయంగా నడుచుకుంటూ ఆసుపత్రికి వచ్చారని కుటుంబ సభ్యులు తెలిపారు. మెడకు ఒకవైపు రక్తనాళంలో రక్తం గడ్డకట్టిందని, స్టెంట్ వేయాల్సి ఉంటుందని వైద్యులు సూచించినట్లు చెప్పారు. అయితే స్టెంట్ వేయాల్సిన ప్రదేశంలో కాకుండా మరోవైపు స్టెంట్ అమర్చారని, ఈ చికిత్స అనంతరం రెండు వైపులా సమస్యలు తలెత్తి బ్రెయిన్ స్ట్రోక్ వచ్చిందని వారు ఆరోపించారు. ప్రస్తుతం రోజమ్మ కాళ్లు, చేతులు పనిచేయడం లేదని, పూర్తిగా మంచానికే పరిమితమయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. మొదట మెగా శాంతో అనే వైద్యుడితో ఆపరేషన్ చేయిస్తామని చెప్పిన ఆసుపత్రి వర్గాలు, చివరకు సాకేత్ అనే వైద్యుడితో ఆపరేషన్ చేయించాయని తెలిపారు. ఈ నెల 27వ తేదీన ఆపరేషన్ జరిగిందని, అప్పటి నుంచి ఇప్పటివరకు రోజమ్మ మంచంపైనే ఉన్నారని పేర్కొన్నారు. రోగి పరిస్థితి ఇంత విషమంగా ఉన్నప్పటికీ ఆసుపత్రి యాజమాన్యం సరైన రీతిలో స్పందించడం లేదని కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఆసుపత్రి సీఈఓగా ఒక వ్యక్తిని పరిచయం చేయగా, ఆయనను ప్రశ్నించినప్పుడు తాను సీఈఓను కాదని, అడ్మిన్ మాత్రమేనని చెప్పినట్లు వెల్లడించారు.

నవంబర్ 2న హైదరాబాద్‌లో బీజేపీ ర్యాలీ

హాజరుకానున్న కేంద్ర హోంమంత్రి అమిత్ షా

హైదరాబాద్ 'లోక్‌తంత్ర బచావో బీడ్ తంత్ర హటావో' నినాదంతో నవంబర్ 2న హైదరాబాద్‌లో నిర్వహించనున్న ర్యాలీకి కేంద్ర హోంమంత్రి అమిత్ షా హాజరుకానున్నట్లు భాగ్యనగర్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు నిరంజన్ యాదవ్ వెల్లడించారు. మాదన్నపేటలోని జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్ఐఆర్‌పై కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేస్తోందని ఆరోపించారు. ఓటర్ల జాబితా సవరణలో మరణించినవారు, చిరునామా మారినవారు, అందుబాటులో లేనివారు, ఒకటి కంటే ఎక్కువ చోట్ల ఓటు నమోదు చేసుకున్నవారి వివరాలను పరిశీలించకుండా 13 కోట్ల మంది ఓటర్ల పేర్లు తొలగించారంటూ ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ ఆరోపణలకు వాస్తవాలతో ప్రజల్లోకి వెళ్లాలని బీజేపీ నిర్ణయించినట్లు తెలిపారు.

ఈ సమావేశంలో మాజీ కార్పొరేటర్ సహదేవ్ యాదవ్, జిల్లా బీజేపీ అధికార ప్రతినిధి ప్రభా గౌడ్, నేతలు పుప్పాల శ్రీనాథ్, చంద్రశేఖర్, కామాటి మహేష్, డివిజన్ అధ్యక్షుడు యోగేంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగేందుకు వెళ్లి.. విద్యుదాఘాతంతో ఇద్దరు ఇంజినీరింగ్ విద్యార్థులు మృతి

మొయినాబాద్, అక్టోబర్ 31: మద్యం తాగేందుకు బహిరంగ ప్రదేశానికి వెళ్లిన ఇద్దరు ఇంజినీరింగ్ విద్యార్థులు విద్యుదాఘాతానికి గురయ్యారు. పోలీస్ పెట్రోలింగ్ వాహనాన్ని చూసి అక్కడి నుంచి పారిపోయే ప్రయత్నంలో పంట పొలానికి పందుల బెడద నుంచి రక్షణగా ఏర్పాటు చేసిన విద్యుత్తు తీగలకు తగిలి ప్రాణాలు కోల్పోయారు. ఈ విషాద ఘటన రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలో కలకలం రేపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని చిలుకూరు గ్రామ రెవెన్యూ పరిధిలో ఉన్న కేజీ రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన 8 మంది విద్యార్థులు శుక్రవారం రాత్రి పెద్దమంగళారం రెవెన్యూ పరిధిలోని పద్మావతి ఫంక్షన్ హాల్ వెనుక ఉన్న బహిరంగ ప్రదేశంలో మద్యం తాగేందుకు వెళ్లారు. అక్కడ మద్యం సేవిస్తుండగా అదే సమయంలో పోలీస్ పెట్రోలింగ్ వాహనం అటుగా వచ్చింది. దాన్ని చూసిన విద్యార్థులు భయపడి అక్కడి నుంచి పరుగులు తీశారు. ఈ క్రమంలో అడవి పందుల నుంచి పంట కాపాడుకునేందుకు ఓ రైతు పొలం చుట్టూ వేసిన విద్యుత్ తీగలకు తగిలారు. దీంతో విద్యుదాఘాతానికి గురై ఇద్దరు విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. మృతుల వివరాలను సేకరించారు. మృతులను అత్తాపూర్‌కు చెందిన మోక్ష సాయి చరణ్ (20), బల్కంపేటకు చెందిన యశ్వంత్ (20)గా గుర్తించారు. అనంతరం మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రి మార్చురీకి తరలించారు. కాగా, పంట పొలం చుట్టూ విద్యుత్ తీగలు ఏర్పాటు చేయడమే ఇద్దరు విద్యార్థుల మృతికి కారణమైందా అనే కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు. పొలానికి విద్యుత్తు తీగలు ఏర్పాటు చేసిన రైతుపై కేసు నమోదు చేసే అవకాశం ఉన్నట్టు తెలుస్తున్నది.

ఇస్రో మరో ఘనత.. నింగిలోకి దూసుకెళ్లిన ఎన్‌వీఎస్-03 శాటిలైట్

ఎన్‌వీఎస్-03 ఉపగ్రహాన్ని విజయవంతంగా ప్రయోగించిన ఇస్రో

భారత నావిగేషన్ వ్యవస్థ 'నావ్‌ఐసీ'కి పెరగనున్న బలం

కనీస కార్యాచరణకు అవసరమైన 4 ఉపగ్రహాల మైలురాయి పూర్తి



దేశీయంగా అభివృద్ధి చేసిన అణు గడియారం ఈ ఉపగ్రహంలో మరో ప్రత్యేకతపౌర, సైనిక అవసరాలకు స్వదేశీ నావిగేషన్ సేవలు బలోపేతంభారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) మరో కీలక విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. దేశీయ నావిగేషన్ వ్యవస్థ 'నావ్‌ఐసీ' ను బలోపేతం చేసే లక్ష్యంతో చేపట్టిన ఎన్‌వీఎస్-03 ఉపగ్రహ ప్రయోగం విజయవంతమైంది. ఆంధ్రప్రదేశ్‌లోని సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్ నుంచి శుక్రవారం రాత్రి 11:51 గంటలకు జీఎస్ఎల్‌వీ-ఎఫ్18 రాకెట్ నింగిలోకి దూసుకెళ్లింది. ప్రయోగం జరిగిన దాదాపు 20 నిమిషాల తర్వాత, 2,250 కిలోల బరువున్న ఎన్‌వీఎస్-03 ఉపగ్రహాన్ని రాకెట్ విజయవంతంగా నిర్దేశిత జియోసింక్రోనస్ ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్ (జీటీవో)లోకి ప్రవేశపెట్టింది. ఈ విషయాన్ని ఇస్రో చైర్మన్ డాక్టర్ వి.నారాయణన్ ధ్రువీకరించారు. రాకెట్‌లోని అన్ని వ్యవస్థలు అద్భుతంగా పనిచేశాయని, ఉపగ్రహం ఆరోగ్యంగా ఉందని ఆయన తెలిపారు. ఈ ప్రయోగ విజయంతో, నావ్‌ఐసీ వ్యవస్థ సమర్థంగా పనిచేయడానికి అవసరమైన కనీస నాలుగు ఉపగ్రహాల మైలురాయిని ఇస్రో చేరుకుంది. ఇది దేశీయ స్థాననిర్ణయ, నావిగేషన్, టైమింగ్ (పీఎన్‌టీ) సేవలకు భరోసానిస్తుంది. ఈ ఉపగ్రహంలో దేశీయంగా అభివృద్ధి చేసిన అణు గడియారాన్ని అమర్చడం మరో విశేషం. ఇప్పటికే ఉన్న ఎల్5, ఎస్-బ్యాండ్ సిగ్నళ్లతో పాటు కొత్తగా ఎల్1 ఫ్రీక్వెన్సీ బ్యాండ్‌లోనూ ఇది సిగ్నళ్లను ప్రసారం చేస్తుంది. దీనివల్ల భారత భూభాగంతో పాటు, దేశ సరిహద్దుల నుంచి 1,500 కిలోమీటర్ల వరకు నావిగేషన్ సేవలు అందుబాటులోకి వస్తాయి. గతంలో మొదటి తరం ఉపగ్రహాల జీవితకాలం ముగియడం, అణు గడియారాల్లో సమస్యలు రావడం, ఎన్‌వీఎస్-02 ఉపగ్రహం ప్రొపల్షన్ సమస్యతో విఫలం కావడం వంటి అడ్డంకులను అధిగమించి ఇస్రో ఈ విజయాన్ని సాధించింది. కేవలం 56 రోజుల వ్యవధిలోనే మరో జీఎస్ఎల్వీ ప్రయోగాన్ని చేపట్టడం ఇస్రో సామర్థ్యానికి నిదర్శనం. ప్రస్తుతం ఉపగ్రహం తన ఆన్‌బోర్డ్ ఇంజిన్ల సాయంతో తదుపరి కక్ష్య పెంపు విన్యాసాలు చేపడుతుంది.

అనంతరం తుది పరీక్షల తర్వాత ఇది నావ్‌ఐసీ వ్యవస్థలో సేవలు అందించడం ప్రారంభిస్తుంది. రహదారి, సముద్ర నావిగేషన్, విపత్తు నిర్వహణ, వ్యవసాయం వంటి పౌర అవసరాలతో పాటు, సైనిక వ్యూహాత్మక అవసరాలకు కూడా నావ్‌ఐసీ వ్యవస్థ అత్యంత కీలకం కానుంది.

ఫుట్‌పాత్‌పై బైక్ నడిపితే రూ.5 వేలు..

వన్‌వేలో వెళ్తే రూ.10 వేల ఫైన్?

బెంగళూరులో కఠినంగా ట్రాఫిక్ రూల్స్

బెంగళూరులో ట్రాఫిక్ నిబంధనలు మరింత కఠినతరం చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నది. సగం హెల్మెట్ ధరించే వాళ్లపై ఫైన్లు వేయడంతో పాటు వాటిని అమ్ముతున్న వారిపై, తయారీదారులపై కూడా కఠిన చర్యలు తీసుకోవడానికి ప్రభుత్వం సిద్ధం అవుతున్నది. అలాగే ఫుట్‌పాత్‌లపై బైకులు నడిపితే రూ.500 ఉన్న ఫైన్‌ను రూ.5వేలకు పెంచనున్నారు. వన్‌వేపై వెళ్తే వేసే వెయ్యి జరిమానాను రూ.10వేలకు పెంచాలని ప్రభుత్వం యోచిస్తున్నది. ఈ మేరకు రాష్ట్ర రవాణా, హోం శాఖలు సమర్పించిన ప్రతిపాదనలపై ప్రభుత్వం పరిశీలన జరుపుతున్నది. బుధవారం విధానసౌధలో హోంమంత్రి ప్రియాంక్ ఖర్గే, రవాణా మంత్రి బి. సురేశ్ ఉన్నతాధికారులతో సంయుక్త సమీక్ష నిర్వహించారు. బెంగళూరులో ట్రాఫిక్ రద్దీ తగ్గించడం, రోడ్డు భద్రతను మెరుగుపరచడం, పదేపదే నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవడంపై చర్చించారు. ఫుట్‌పాత్‌లపై వాహనాల నడపడం, వన్‌వే ఉల్లంఘనలు, అక్రమ పార్కింగ్, నో పార్కింగ్ ప్రాంతాల్లో వాహనాల నిలుపుదల, సిగ్నల్ ఉల్లంఘనలపై జరిమానాలు పెంచే ప్రతిపాదనలూ సమావేశంలో చర్చకు వచ్చాయి. ప్రస్తుతం ఫుట్‌పాత్‌పై ద్విచక్ర వాహనం నడిపితే విధిస్తున్న రూ.500 జరిమానాను మొదటిసారి ఉల్లంఘనకు రూ.5,000కు, రెండోసారి ఉల్లంఘిస్తే రూ.10,000కు పెంచాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. వన్‌వే ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించేవారిపైనా కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం యోచిస్తున్నది. ప్రస్తుతం ఈ ఉల్లంఘనకు రూ.1,000 జరిమానా ఉండగా.. దాన్ని పదిరెట్లు పెంచి రూ.10,000కు చేర్చాలని ప్రతిపాదించింది. రవాణా, హోం శాఖలు ఈ మేరకు ప్రతిపాదనలు సమర్పించాయి. న్యాయశాఖ అభిప్రాయం తీసుకున్న తర్వాత ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోనున్నది. పదేపదే ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడే వాహనదారులపై మరింత కఠినంగా వ్యవహరించేందుకు పాయింట్ల ఆధారిత డ్రైవింగ్ లైసెన్స్ విధానాన్ని తీసుకురావడంపైనా అధికారులు చర్చించారు. వివిధ రకాల ఉల్లంఘనలకు నిర్దిష్ట పాయింట్లు కేటాయిస్తారు. ఒక డ్రైవర్ నిర్దేశిత పరిమితికి చేరుకుంటే అతడి డ్రైవింగ్ లైసెన్స్‌ను సస్పెండ్ చేసే అవకాశం ఉంటుంది. ఈ విధానం అమలుకు అవసరమైన చట్టపరమైన అంశాలపైనా సమీక్షించారు. రవాణా శాఖకు చెందిన సారథి వ్యవస్థను బెంగళూరు ట్రాఫిక్ పోలీసుల ఈ-చలాన్ వ్యవస్థతో అనుసంధానించే అంశాన్ని కూడా పరిశీలించారు. దీనివల్ల వాహనదారుల డ్రైవింగ్ లైసెన్స్ చెల్లుబాటును పోలీసులు అక్కడికక్కడే తనిఖీ చేయగలుగుతారు. గతంలో చేసిన ట్రాఫిక్ ఉల్లంఘనల వివరాలనూ తెలుసుకోవచ్చు. కొత్తగా నమోదయ్యే ఉల్లంఘనలను నేరుగా (డ్రైవర్ డిజిటల్ రికార్డ్స్‌కు) అనుసంధానించవచ్చు.

పెద్ద ప్లాన్‌తోనే తెలంగాణలో అమిత్ షా

హైదరాబాద్, అక్టోబరు 31, తెలంగాణ గడ్డపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా నేరుగా రంగంలోకి దిగి పాదయాత్రలో పాల్గొంటున్నారు. ఇందు కోసం బీజేపీ గట్టి ఏర్పాట్లు చేస్తోంది. ఈ పాదయాత్ర కార్యక్రమం ఆషామాషీ రాజకీయ పరిణామం కాదు. బీజేపీ జాతీయ వ్యూహరచనలో పశ్చిమ బెంగాల్‌ను ఒక దశలో ప్రధాన టార్గెట్‌గా ఎంచుకుని అక్కడ ఎలాగైతే కాషాయ దళాన్ని విజేతగా నిలబెట్టారో.. అదే తరహాలో తెలంగాణలోనూ జెండా పాతేలా చేయాలనుకుంటున్నారు.

బెంగాల్ తర్వాత దక్షిణాదిలో బీజేపీకి తెలంగాణనే అసలైన లక్ష్యమని అమిత్ షా గతంలోనే పలుమార్లు కుండబద్దలు కొట్టారు. సాధారణంగా కేంద్ర స్థాయిలోనే వ్యూహాలు రచించే చాణక్యుడు స్వయంగా రోడ్డుపైకి వచ్చి అడుగులు వేస్తున్నారంటే, రాబోయే రోజుల్లో రాష్ట్రంలో రాజకీయ దూకుడును ఏ స్థాయికి తీసుకెళ్లబోతున్నారో స్పష్టమవుతోంది. ఈ భారీ రాజకీయ సమరానికి ముందుగా పార్టీలోని అంతర్గత సమస్యలను చక్కదిద్దే కసరత్తును అధిష్టానం వేగవంతం చేసింది. పార్టీ రాష్ట్ర సారథిగా బాధ్యతలు చేపట్టిన కొత్త నాయకత్వం.. నేతల మధ్య ఉన్న ఆధిపత్య పోరు బహిర్గతం కాకుండా, ఆ ప్రభావం కేడర్‌పై పడకుండా ఇప్పటికే అంతర్గత సర్దుబాట్లు చేసింది. క్షేత్రస్థాయిలో ఈటల రాజేందర్, బండి సంజయ్, రఘునందన్ రావు, ధర్మపురి అరవింద్ వంటి అగ్ర నేతలు ఎవరికి వారు ప్రజాసమస్యలపై తమదైన శైలిలో పోరాడుతున్నప్పటికీ.. అంతిమంగా పార్టీ వేదికపైకి వచ్చేసరికి ఐక్యతను ప్రదర్శించేలా క్రమశిక్షణను నిర్దేశించారు. ఈ అంతర్గత సమన్వయం పక్కాగా కుదిరితే, నేతల వ్యక్తిగత బలాలన్నీ కలిసి పార్టీకి భారీ సంయుక్త శక్తిగా మారి మైలేజీని తెచ్చిపెడతాయన్నది పార్టీ పెద్దల అంచనా.

అమిత్ షా స్వయంగా మైదానంలోకి దిగి రోడ్‌మ్యాప్‌ను అమలు చేయడం ప్రారంభిస్తే.. రాబోయే ఆరు నెలల్లో తెలంగాణ రాజకీయ సమీకరణాలు సమూలంగా మారిపోవడం ఖాయంగా కనిపిస్తోంది.

పదేళ్ల పాటు రాష్ట్రాన్ని పాలించి ప్రస్తుతం వరుస ఓటములు, అంతర్గత కుమ్ములాటలతో ఉనికిని కాపాడుకునేందుకు తంటాలు పడుతున్న బీఆర్ఎస్‌ను పూర్తిగా మూడో స్థానానికి పరిమితం చేయడమే ఈ వ్యూహం వెనుక ఉన్న అసలైన లక్ష్యం.

రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై ప్రజల్లో వ్యక్తమవుతున్న అసంతృప్తి, రైతాంగ, పట్టణ సమస్యలను బీజేపీ తనవైపు తిప్పుకుని.. ప్రతిపక్ష శూన్యతను కాషాయ దళంతో భర్తీ చేయాలని ఢిల్లీ నాయకత్వం గట్టి పట్టుదలతో ఉంది.

అమిత్ షా తాజా రాజకీయ ఎత్తుగడలు క్షేత్రస్థాయిలో అమలైతే.. తెలంగాణలో ప్రధాన పోరు 'బీజేపీ వర్సెస్ కాంగ్రెస్' అన్నట్లుగా పూర్తిస్థాయిలో బైపోలార్‌గా మారిపోయే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. కేంద్ర దర్యాప్తు సంస్థల దూకుడు, ప్రజాక్షేత్రంలో అగ్రనేతల వరుస పర్యటనలు, బూత్ స్థాయి వ్యవస్థాగత బలోపేతం వంటి వ్యూహాలతో రేవంత్ ప్రభుత్వాన్ని నాలుగు వైపుల నుంచి ఉక్కిరిబిక్కిరి చేయనున్నారు. గులాబీ పార్టీ కనుమరుగై, కాంగ్రెస్‌కు ఏకైక తిరుగులేని ప్రత్యామ్నాయం బీజేపీయేనన్న బలమైన భావనను ఓటర్లలో నాటడం ద్వారా.. తెలంగాణలో అధికారాన్ని కైవసం చేసుకునేందుకు అమిత్ షా వేసిన ఈ పాదయాత్ర స్కెచ్ రాష్ట్ర రాజకీయాలను మలుపు తిప్పనుందనడంలో సందేహం లేదు.

అడ్డూ, అదుపు లేకుండా పెరుగుతున్న బియ్యం...

హైదరాబాద్, అక్టోబరు 31, తెలంగాణలో ఆకాశాన్నంటుతున్న నిత్యావసరాల ధరలతో అల్లాడుతున్న సామాన్యుడిని ఆదుకునే క్రమంలో.. సాధారణ ప్రజలు విస్తృతంగా వినియోగించే బీపీటీ రకం బియ్యం ధర కిలో రూ. 66 మించకూడదంటూ పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. మార్కెట్లో ప్రీమియం, సన్నబియ్యం ధరలు క్వింటాళ్లకు వేల రూపాయలు ఎగబాకి, కిలో రూ. 90 నుంచి రూ. 100 దాకా పలుకుతూ మధ్యతరగతి జేబులకు చిల్లులు వేస్తున్న వేళ.. ప్రభుత్వం కఠిన హెచ్చరికలు జారీ చేయడం ఊరటనిచ్చే అంశం. అయితే, గతంలోనూ ధరల నియంత్రణపై ఎన్నోసార్లు ఇలాంటి సమీక్షలు, గంభీర ప్రకటనలు వచ్చినప్పటికీ.. క్షేత్రస్థాయి రిటైల్ దుకాణాల్లో వ్యాపారులు వాటిని ఏమాత్రం లెక్కచేయకుండా యథేచ్ఛగా దోపిడీ సాగించిన చేదు అనుభవాలు ఉన్నాయి. ఈసారి కేవలం మాటలతో సరిపెట్టకుండా పౌరసరఫరాలు, పోలీసు, జీఎస్టీ, లీగల్ మెట్రాలజీ వంటి ఐదు విభాగాలతో సంయుక్త తనిఖీలు చేపట్టడం, హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో బేగంబజార్, నాంపల్లి, మహారాజ్‌గంజ్ వంటి ప్రధాన హోల్‌సేల్ మార్కెట్లలో దాడులు చేసి 12 కేసులు నమోదు చేయడం ప్రభుత్వ సీరియస్‌నెస్‌ను సూచిస్తోంది. కృత్రిమ కొరత సృష్టించి బ్లాక్ మార్కెట్లకు తరలించే మిల్లర్లు, హోల్‌సేలర్ల నెట్‌వర్క్‌ను గుర్తించి చర్యలు తీసుకోవడం మంచి పరిణామమే. అయితే, ఈ దాడులు కేవలం పెద్ద హోల్‌సేల్ మండీల వద్ద ఫోటోషూట్‌లకే పరిమితమైతే ఫలితం శూన్యం. నగరాలు, పట్టణాలు, పల్లెల్లో ఉండే చిన్న చిన్న కిరాణా షాపులు, రిటైల్ మార్కెట్ల దాకా నిరంతర నిఘా ఉంటేనే ఈ రూ. 66 ధరల పరిమితి ప్రజలకు వాస్తవంగా ఉపయోగపడుతుంది. రాష్ట్రంలో సరిపడా ధాన్యం నిల్వలు ఉన్నాయని, వినియోగదారులు భయాందోళనలకు గురై పెద్ద ఎత్తున నిల్వ చేసుకోవద్దని మంత్రి ధైర్యం చెబుతున్నప్పటికీ.. కొరత భయాన్ని తొలగించాల్సింది కేవలం మాటలతో కాదు, మార్కెట్ స్థిరీకరణతోనే. రేషన్ దుకాణాల ద్వారా నాణ్యమైన సన్నబియ్యం అందిస్తున్నామని, వాటిని వినియోగించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేసినప్పటికీ.. క్షేత్రస్థాయిలో ఆ బియ్యం పంపిణీ నాణ్యత, సరఫరా గొలుసులో ఉన్న లోపాలను సరిదిద్దాల్సిన బాధ్యత కూడా పౌరసరఫరాల శాఖపైనే ఉంది. రేషన్ బియ్యం నాణ్యతపై ప్రజల్లో నమ్మకం పెంచితే తప్ప ఓపెన్ మార్కెట్ బియ్యంపై ఆధారపడటం తగ్గదు. ఆర్ఎన్ఆ రకాల ధరలను కూడా సమీక్షిస్తామని చెబుతున్న సర్కారు.. కేవలం ఒకే రకంపై కాకుండా మార్కెట్లో డిమాండ్ ఉన్న ఇతర నాణ్యమైన బియ్యం రకాలపై కూడా స్పష్టమైన ధరల పట్టికను అమలు చేయాల్సి ఉంది. టాస్క్‌ఫోర్స్ తనిఖీలను నిరంతర ప్రక్రియగా కొనసాగించాలన్న సూచనలు వినిపిస్తున్నాయి. నిబంధనలు ఉల్లంఘించే బడా మిల్లర్ల లైసెన్సులు రద్దు చేయడం, అక్రమ నిల్వలను సీజ్ చేసి బహిరంగ మార్కెట్లలో రీజనబుల్ ధరకు అమ్మేలా చేయడం వంటి కఠిన చర్యలు చేపడితేనే వ్యాపారుల్లో భయం పుడుతుంది. అలా కాకుండా ఒకట్రెండు రోజుల హడావుడి తర్వాత తనిఖీలు చల్లబడితే.. వ్యాపారులు మళ్లీ కృత్రిమ కొరత సృష్టించి మరింత ఎక్కువ ధరలకు విక్రయించే ప్రమాదం ఉంది. పాలకుల చిత్తశుద్ధి ప్రభుత్వ ఆదేశాల జారీలో కాదు.. గల్లీలోని కిరాణా కొట్టులో సామాన్య వినియోగదారుడు సంచిలో బియ్యం పోయించుకునేటప్పుడు కనిపించే ధరలోనే ప్రతిబింబిస్తుందన్న నిజాన్ని ప్రభుత్వం విస్మరించకూడదు.

సూర్యాపేట జిల్లాలో విషాదం..

సూర్యాపేట జిల్లాలో విషాదం నెలకొంది. పిడుగుపాటుకు ఓ యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. శుక్రవారం రాత్రి జరిగిన ఈ ఘటనతో పెన్‌పహాడ్ మండలం మాచారం గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. వివరాల్లోకి వెళ్తే.. పెన్‌పహాడ్ మండలం మాచారం గ్రామానికి చెందిన ధూబని నాగరాజు (32) గొర్రెల కాపరిగా జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం గ్రామ శివారులోని రాయి చెరువు సమీపంలో రాత్రి గొర్రెల మందకు కాపలాగా నాగరాజు పడుకున్నాడు. ఈ క్రమంలో రాత్రి పిడుగుపడటంతో అతను అక్కడికక్కడే మృతిచెందాడు.

గాళ్స్ హాస్టల్ అడ్డగా... అండాల సేకరణ...

హైదరాబాద్, అక్టోబరు 21,అది పేరుకే లేడీస్ హాస్టల్.. చేసేది అండాల బిజినెస్.. బేగంపేట ప్రకాష్‌నగర్‌లో బయటపడ్డ అండాల అక్రమ దందా.. హైదరాబాద్‌లో గర్ల్స్ హాస్టల్ పేరుతో నడుపుతున్న గలీజ్ దందా గుట్టురట్టు అయింది. బేగంపేటలో యువతుల అండాల సేకరణ ముఠా వ్యవహారం బట్టబయలు అయింది. బేగంపేట పోలీసులు, ఎస్ఓటీ పోలీసుల సంయుక్తంగా దాడుల్లో 10మంది యువతులు అడ్డంగా బుక్కవడం కలకలం రేపుతోంది. హైదరాబాద్ బేగంపేటలో యువతుల అండాల అక్రమ సేకరణ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ప్రకాష్‌నగర్‌లోని నట్రాన్ అపార్ట్‌మెంట్‌లో గలీజ్ వ్యవహారం సాగుతున్నట్టు ఆరోపణలు రావడంతో పోలీసులు ఆకస్మికంగా దాడులు చేశారు. అర్ధరాత్రి 2గంటల సమయంలో బేగంపేట పోలీసులు, ఎస్ఓటీ బృందాలు సంయుక్తంగా నిర్వహించిన తనిఖీల్లో ఈ దారుణ వ్యవహారం బయటపడింది. పోలీసులకు 10మంది యువతులు పట్టుబడటం సంచలనం రేపింది. వీరిని బిహార్, ఉత్తరప్రదేశ్, ఒడిశాకు చెందిన యువతులుగా గుర్తించి.. అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. బేగంపేట ప్రకాశ్‌నగర్‌లో ఏడాదికాలంగా అమీ నీతా గర్ల్స్ హాస్టల్ పేరుతో ఈ అక్రమ అడ్డగోలు కార్యకలాపాలు సాగిస్తున్నట్టు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. ఈ క్రమంలోనే.. అండాల సేకరణతో పాటు సంతాన సాఫల్య కేంద్రాలతో సంబంధాలపైనా పోలీసులు ఆరా తీస్తున్నారు. యువతుల నుంచి అండాలను సేకరించి సమీపంలోని సంతాన సాఫల్య కేంద్రాలకు సరఫరా చేస్తున్నారన్న ఆరోపణలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మహిళల అండాలతో పాటు పురుషుల వీర్యకణాల సరఫరాకు సంబంధించిన దందాపైనా పోలీసులు ఫోకస్ పెట్టారు. ఈ మొత్తం వ్యవహారం వెనుక ఓ మహిళ ప్రమేయం ఉందనే అనుమానంతో ఆమెను కూడా ప్రశ్నిస్తున్నట్టు తెలుస్తోంది. అలాగే.. అండాల అక్రమ సేకరణ, విక్రయాల వెనుక ఇంకా ఎవరెవరు ఉన్నారనే కోణంలోనూ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అయితే.. అండాల సేకరణలో యువతుల సమ్మతి ఉందా?.. డోనర్స్ విషయంలో అసలు మెడికల్ రూల్స్ పాటిస్తున్నారా?.. అండాల సరఫరా వెనుక ఉన్న వ్యక్తులు ఎవరు?.. ఈ అండాలను ఏఏ ఫెర్టిలిటీ సెంటర్లకు పంపుతున్నారనే వివరాలను సేకరించే పనిలో పడ్డారు పోలీసులు.

ఇక.. ప్రకాశ్‌నగర్‌లోని అమీ నీతా గర్ల్స్ హాస్టల్‌లో ఎప్పటినుంచో చాలా మంది మహిళలు ఉంటున్నారని స్థానికులు చెప్పారు. అంతా బయట రాష్ట్రాల యువతులేనని తెలిపారు. అర్ధరాత్రి సమయంలో ఇంటి పక్కన అపార్ట్‌మెంట్లో పోలీసులు దాడులు చేయడంతో ఆందోళనకు గురయ్యామన్నారు స్థానికులు. తీరా చూస్తే.. కొంతమంది యువతులను అదుపులోకి తీసుకున్నట్టు తెలిసిందని చెప్పారు. మొత్తంగా.. హైదరాబాద్‌లో మరోసారి అండాలు, వీర్యకణాల అక్రమ సేకరణ దందా గ్యాంగ్ గుట్టు రట్టయింది. గర్ల్స్ హాస్టల్ పేరుతో యువతుల అండాలను సేకరించి.. ఫెర్టిలిటీ సెంటర్లకు విక్రయిస్తున్న ముఠా బండారాన్ని బేగంపేట పోలీసులు బట్టబయలు చేయడం సంచలనంగా మారింది.

నిప్పులు చిమ్ముకుంటూ నింగిలోకి జీఎస్ఎల్వీ-ఎఫ్18

శ్రీహరికోట, అక్టోబరు 31, భారత అంతరిక్ష సంస్థ ఇస్రో ఒక భారీ రాకెట్‌ను ప్రయోగించి విజయవంతమైంది. జీఎస్ఎల్వీ-ఎఫ్18 రాకెట్, 2026 అక్టోబర్ 30వ తేదీన రాత్రి 11:51 గంటలకు శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం నుంచి నింగిలోకి దూసుకెళ్లింది. ఈ రాకెట్ ఎన్వీఎస్-03 అనే నావిగేషన్ ఉపగ్రహాన్ని మోసుకెళ్లింది. ప్రయోగం విజయవంతం కావడంతో ఇస్రో శాస్త్రవేత్తలు ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. ఈ ఉపగ్రహం భారతదేశపు నావిక్ వ్యవస్థను మరింత బలోపేతం చేయనుంది. జీఎస్ఎల్వీ రాకెట్ తన 20వ ప్రయోగం. ఈ రాకెట్ ఎన్వీఎస్-03 ఉపగ్రహాన్ని జియోసింక్రోనస్ ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్‌లోకి ప్రవేశపెట్టింది. ఈ ప్రయోగం రెండవ లాంచ్ ప్యాడ్ నుండి ప్రవేశపెట్టిన ఇస్రో.. మూడు దశల్లో ప్రవేశపెట్టి సక్సెస్ చేసింది. దీంతో ఇస్రోలో శాస్త్రవేత్తలు సంబరాలు చేసుకున్నారు. ఔమా-03 2232 బరువుగల శాటిలైట్ ను నింగిలోకి మోసుకెళ్లింది. భారత్ సొంతంగా తయారు చేసుకున్న నావిగేషన్ వ్యవస్థను బలోపేతానికి ఔమా-03ని ప్రయోగించింది. ఈ ఉపగ్రహం13 ఏళ్ల పాటు కక్షలో పని చేయనుంది.ఔమా-03 అనేది రెండవ తరం నావిక్ ఉపగ్రహాలలో మూడవది. దీనికి స్వదేశీంగా తయారు చేసిన అటామిక్ క్లాక్, కొనుగోలు చేసిన అటామిక్ క్లాక్‌ను అమర్చారు. మునుపటి ఉపగ్రహాలలో ఒ5 , వా సిగ్నల్స్ ఉండేవి. ఇప్పుడు కొత్తగా ఒ1 సిగ్నల్‌ను జోడించారు. ఇది నావిగేషన్‌ను మరింత మెరుగుపరుస్తుంది. ఈ ఉపగ్రహం భారతదేశ భూభాగం, దాని చుట్టూ 1,500 కిలోమీటర్ల వరకు ఉన్న ప్రాంతానికి కచ్చితమైన ప్రదేశం, వేగం, సమయ సమాచారాన్ని అందిస్తుంది.నావిక్ అనేది భారతదేశపు సొంత నావిగేషన్ వ్యవస్థ. ఇది రెండు రకాల సేవలను అందిస్తుంది. ఒకటి సాధారణ ప్రజల కోసం ఉద్దేశించిన 'స్టాండర్డ్ పొజిషనింగ్ సర్వీస్', మరొకటి ప్రత్యేక ప్రయోజ నాల కోసం ఉద్దేశించిన 'రెస్ట్రిక్టెడ్ సర్వీస్'.ఇస్రో మొత్తం ఐదు సెకండ్ జనరేషన్ ఉపగ్రహాలను నిర్మించాలని యోచిస్తోంది. ఇస్రో 2023 మే 29న జీఎస్ఎల్వి-ఎఫ్12 రాకెట్ ద్వారా ఎన్‌విఎస్-01ను అంతరిక్షం లోకి ప్రయోగించింది. ఇది మొట్టమొదటి స్వదేశీ అణు గడియారాన్ని మోసుకెళ్లింది. ఇప్పుడు ఈ రోజు ప్రయోగించిన కొత్త ఉపగ్రహం ఎన్‌విఎస్-03, ఆ లక్ష్యాన్ని ముందుకు తీసుకువెళ్తుంది. ఈ వ్యవస్థ వాహన నావిగేషన్, లొకేషన్ సేవలు, ఇతర ప్రయోజనాలకు ఉపయోగపడుతుంది. ఇది ఒకప్పుడు ఇతర దేశాల వ్యవస్థలపై భారతదేశం ఆధారపడటాన్ని తగ్గిస్తుంది. అందువల్ల ఈ రాత్రి జరిగే ఇస్రో ఉపగ్రహ ప్రయోగం దేశానికి చాలా కీలకం.

తొమ్మిది నియోజకవర్గాలకు తాగునీటి ముప్పు..

హైదరాబాద్, అక్టోబరు 31 ఎల్‌నినో వర్షాభావంతో మంజీర, సింగూరు జలాశయాలు అడుగంటి, హైదరాబాద్‌లోని 9 నియోజకవర్గాల్లో నీటి ఎద్దడితో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యామ్నాయ సరఫరా ఏర్పాట్లను ముమ్మరం చేయాలని అధికారులను ఆదేశించారు.ఎల్‌నినో ప్రతికూల వర్షాభావ పరిస్థితులు హైదరాబాద్ మహానగర ప్రజలపై తీవ్ర ప్రభావం చూపే అవకాశాలు ఉన్నాయి. నగరంలోని ప్రధాన తాగునీటి ఆధారాలైన మంజీర, సింగూరు జలాశయాల్లో నీటి నిల్వలు అడుగంటిపోతుండటమే దీనికి కారణం. హైదరాబాద్ సిటీ పరిధిలో మొత్తం 22 నియోజకవర్గాలు ఉండగా.. అందులో మంజీరా పైపులైన్లు ఉన్న 9 నియోజకవర్గాల్లో నీటి సమస్య తీవ్రమయ్యే పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నీటి ముప్పును తిప్పికొట్టేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యామ్నాయ ఏర్పాట్లను చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు.హైదరాబాద్ సిటీకి ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ జంట జలాశయాలతో పాటు మంజీరా, సింగూరు, కృష్ణా, గోదావరి జలాల నుంచి తాగునీరు సరఫరా అవుతోంది. ప్రస్తుత సంక్షోభ పరిస్థితుల దృష్ట్యా, జంట జలాశయాల్లో ఉన్న నీటిని రాబోయే 360 రోజులకు సరిపోయేలా జలమండలి ప్లాన్ చేసింది. సాధారణంగా సరఫరా చేయాల్సిన 40 ఎంజీడీలకు (మిలియన్ గ్యాలన్స్ పర్ డే) బదులుగా.. ముందస్తు చర్యల్లో భాగంగా ప్రస్తుతం 27 ఎంజీడీలను మాత్రమే అందిస్తున్నారు.సింగూరు జలాశయ గరిష్ఠ నీటి నిల్వ సామర్థ్యం 29.91 టీఎంసీలు కాగా, ప్రస్తుతం కేవలం 3.029 టీఎంసీల నీళ్లు మాత్రమే ఉన్నాయి. మంజీరాలో 1.50 టీఎంసీలకుగాను కేవలం 0.19 టీఎంసీల నీరు ఉంది. ఈ రెండు జలాశయాల్లో కలిపి కేవలం 10 శాతం నీరు మాత్రమే ఉంది. నీటి ఆవిరి, పైపులైన్ల లీకేజీలు పోను ఈ నిల్వలు గరిష్ఠంగా మరొక 60 రోజులకు మాత్రమే సరిపోతాయని అధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించారు. అందుకే ప్రస్తుతం రెండు రోజులకు ఒకసారి, అది కూడా కేవలం 45 నిమిషాల వ్యవధిలోనే నీటిని సరఫరా చేస్తున్నారు.మంజీరా ఆధారిత ప్రాంతాలైన కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి, పటాన్‌చెరు, ఖైరతాబాద్, జూబ్లీహిల్స్, కార్వాన్, సనత్‌నగర్, రాజేంద్రనగర్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గాల్లో ఇప్పటికే భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. శేరిలింగంపల్లి ఐటీ కారిడార్ తో పాటు ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, కేపీహెచ్‌బీ, అమీర్‌పేట్, బంజారాహిల్స్, సోమాజిగూడ, నార్సింగి, నిజాంపేట్ వంటి ప్రాంతాల్లో నీటి ట్యాంకర్లకు విపరీతంగా డిమాండ్ పెరిగింది. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారంగా మంజీరా పైపులైన్లను గోదావరి ఫేజ్-1తో అనుసంధానించేందుకు జలమండలి ప్లాన్ చేసింది. ఎల్లంపల్లి జలాశయంలో 20.17 టీఎంసీల సామర్థ్యానికి గాను 17.703 టీఎంసీల నిల్వలు ఉన్నాయి. ఈ నిల్వలను కేవలం తాగునీటి అవసరాలకే పరిమితం చేస్తే హైదరాబాద్ సిటీకి వచ్చే ఏడాది వేసవి పూర్తయ్యేవరకు నీటి కొరత తలెత్తదు.మంజీరా పైపులైన్లను గోదావరి సరఫరా వ్యవస్థకు అనుసంధానించే పనులు యుద్ధప్రాతిపదికన జరుగుతున్నాయి. రాబోయే 2 నెలల్లో ? పనులు పూర్తయితే హైదరాబాద్ నగరం నీటి గండం నుంచి క్షేమంగా బయటపడుతుందని జలమండలి అధికారులు భావిస్తున్నారు. క్యూర్ పరిధిలో జనాభా 1.32 కోట్ల వరకు ఉండగా.. 14.50 లక్షల వాటర్ ట్యాప్స్ ఉన్నాయి.

ప్రతిరోజూ 560 ఎంజీడీల నీటి సరఫరా జరుగుతోంది

ఖైరతాబాద్ లో మారుతున్న సమీకరణాలు

హైదరాబాద్, అక్టోబరు 31 రాజకీయం ఎపుడూ ఒకేలా ఉండదు. అది మారుతూ ఉంటుంది. ప్రజాభిప్రాయం నిరంతరం గతులు మార్చుకుంటుంది. 2023లో కేసీఆర్ ఓడిపోగానే ఆయన పని అయిపోయింది అని అన్న వారు ఉన్నారు. 2024 లో లోక్ సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ కి ఒక్క పార్లమెంట్ సీటు కూడా రాలేదు, ఆ తరువాత జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ రెండు ఎమ్మెల్యే సీట్లకు జరిగిన ఉప ఎన్నికల్లోనూ బీఆర్ఎస్ కి చేదు అనుభవాలు ఎదురయ్యాయి. కానీ అది నిజం కాదని తాజాగా ఖైరతాబాద్ లో ఒక ప్రముఖ సర్వే సంస్థ ఆర్ఆర్ నిర్వహించిన దాంట్లో తేలింది. ఇందులో విశ్లేషణలు చూస్తే కనుక బీఆర్ఎస్ దే మరోసారి తెలంగాణాలో అధికారం అన్నది తేలుతోంది. లిట్మస్ టెస్ట్ గా రేపు జరగబోయే ఖైరతాబాద్ ఉప ఎన్నికల ఫలితం ఉండబోతోంది అని ఈ సర్వే స్పష్టం చేసింది.

ఖైరతాబాద్ ఉప ఎన్నికల గురించి జనాభిప్రాయాన్ని ఆర్ ఆర్ సర్వే చాలా లోతుల్లోకి వెళ్ళి రాబట్టింది. దానిలో కేసీఆర్ పాలన గురించి జనాలను ప్రశ్నించినపుడు అత్యధిక శాతం ఆయన హయాంలో బాగుంది అని చెప్పారు. అంతే కాదు 2028 లో జరిగే ఎన్నికల్లో సీఎం ఎవరు అంటే కేసీఆర్ అని ఏకంగా 53.84 శాతం మంది ఓటేశారు. ఇక ప్రస్తుతం సీఎం గా ఉన్న రేవంత్ రెడ్డికి 20.87 శాతం మద్దతు తెలిపితే బీజేపీ ఫైర్ బ్రాండ్, కేంద్ర మంత్రి బండి సంజయ్ తదుపరి సీఎం అంటూ కేవలం 14.30 మంది చెప్పారు. మరో కేంద్ర మంత్రి జి కిషన్ రెడ్డికి 4.39 శాతం లభించింది. ఈ సర్వే ప్రకారం చూస్తే కనుక అందరి కంటే చాలా దూరంలోనే కేసీఆర్ నిలిచి తెలంగాణా ప్రజల అభిమానం అందుకున్నారు అని అర్ధం అవుతోంది. అంతే కాదు కేసీఆర్ పరిపాలన ఉత్తమంగా ఉందని, అభివృద్ధి సంక్షేమం ఆయన హయాంలోనే బాగా జరిగాయని ఖైరతాబాద్ జనాలు బల్ల గుద్ది మరీ చెప్పారు. ఆర్ఆర్ సర్వే ప్రకారం చూస్తే రెండు సార్లు సీఎం గా చేసిన కేసీఆర్ కి మద్దతుగా 57.14 శాతం మంది నిలిచారు. అదే సమయంలో రేవంత్ రెడ్డి రెండున్నరేళ్ళ పాలన బాగుందని 21.97 శాతం మంది మాత్రమే మద్దతు ఇవ్వడం విశేషం. అంటే కాంగ్రెస్ ప్రభుత్వం తాము చెప్పుకుంటున్నట్లుగా తెలంగాణాలో అభివృద్ధి సంక్షేమం పట్ల జనం అంత సంతృప్తిగా లేరు అన్నది రాష్ట్ర రాజధాని హైదరాబాద్ లో ఒక కీలక నియోజకవర్గం. రాజకీయంగా చైతన్యవంతమైన ఖైరతాబాద్ లో ఓటర్ల మనోభావాలు తెలియచేశాయని అంటున్నారు.

చేయూత ఫించన్ల కోసం దరఖాస్తులు

వరంగల్, అక్టోబరు 31 తెలంగాణ ప్రభుత్వం చేయూత పింఛన్లకు సంబంధించి మరో కీలక నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం చేయూత పథకం కింద పింఛన్ పొందుతున్న భర్త మరణిస్తే వెంటనే భార్యకు పింఛన్ మంజూరు చేసే విధానం అమల్లో ఉంది. తాజాగా ఈ విధానాన్ని మరింతగా విస్తరించింది. ఇకపై దివ్యాంగులు, డయాలసిస్, హెచ్ఐవీ, ఫైలేరియా, గీత, చేనేత కార్మికుల పింఛనుదారులకూ కూడా ఈ విధానాన్ని వర్తింపజేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.చేనేత, గీత కార్మికులు.. దివ్యాంగులు, ఇతర కేటగిరీల్లో పింఛను అందుకునే జీవిత భాగస్వామి చనిపోతే మహిళలు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారని గమనించిన ప్రభుత్వం.. వారికి అండగా నిలిచేందుకు తక్షణ పింఛను సాయం అందించాలని ప్రతిపాదనలు వచ్చాయి. ఈ ప్రతిపాదనలకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం రావడంతో ఉత్తర్వులు జారీ చేయాలని మంత్రి సీతక్క ఆదేశించారు.. దీంతో అధికారులు వెంటనే ఉత్తర్వులు విడుదల చేశారు. ఈ చేయూత పథకం కింద పింఛన్లకు సంబంధించి కొన్ని మార్గదర్శకాలు కూడా ఉన్నాయి.దివ్యాంగ, గీత, చేనేత కార్మికులు సహా ఆయా కేటగిరీల కింద పింఛన్ పొందుతూ మరణించిన లబ్ధిదారుడి భార్య వయస్సు 57 ఏళ్ల కంటే తక్కువగా ఉంటే వితంతు పింఛను ఇస్తారు. ఒకవేళ 57 ఏళ్లు లేదా అంతకంటే ఎక్కువ వయసు ఉంటే వృద్ధాప్య పింఛను మంజూరు చేస్తారు. ఈ పింఛన్ కోసం దరఖాస్తు చేసుకునేందుకు 15 రోజుల్లోగా భార్య ఆధార్ కార్డు, బ్యాంకు పాస్‌బుక్ మొదటి పేజీ, మరణించిన పింఛనుదారుడి ఆధార్ కార్డు, మరణ ధ్రువీకరణ పత్రం సమర్పించాల్సి ఉంటుంది.

బీజేపీ నేతలకు సునీల్ బన్సాల్ క్లాస్

హైదరాబాద్, అక్టోబరు 31 తెలంగాణా బీజేపీ నేతలకు ఆ రాష్ట్ర బీజేపీ వ్యవహారాల ఇంచార్జ్ సునీల్ బన్సాల్ క్లాస్ తీసుకున్నారు అని అంటున్నారు. ఆయన ఈ బాధ్యతలు స్వీకరించిన తరువాత మొదటిసారి హైదరాబాద్ వచ్చారు. వచ్చిన వెంటనే ఆయన తెలంగాణకు చెందిన బీజేపీ ముఖ్య నేతలు ఇతర నాయకులతో నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన విస్తృత స్థాయి సమీక్షా సమావేశంలో పార్టీ పనితీరు పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇలాగైతే కష్టం అని కూడా చెప్పేశారు. తాను ఇక మీదట పూర్తిగా తెలంగాణాలోనే ఉంటాను అని కూడా స్పష్టం చేశారు. తెలంగాణాలో బీజేపీ నేతల తీరు మారాల్సిందే అని ఆదేశించారు. నాయకులు అంతా హైదరాబాద్ లో ఉంటే పార్టీ ఎలా పటిష్టం అవుతుంది అని సునీల్ బన్సాల్ ప్రశ్నించారు. నిరంతరం ప్రజలతో వారు ఉండాలని పార్టీని బలోపేతం చేయాలని ఆయన గట్టిగానే కోరారు. అంతే కాకుండా రాష్ట్ర స్థాయి నాయకులు కేవలం రాజధాని హైదరాబాద్‌కే పరిమితం కాకుండా జిల్లాలలో పర్యటించాలని, అలాగే గ్రౌండ్ లెవెల్ దాకా వెళ్ళి పార్టీ శ్రేణులతో మమేకం కావాలని ఆయన కోరారు. ప్రజలతో ఉంటేనే పార్టీ బలోపేతం అవుతుందని ఆయన స్పష్టంగా ఒక సందేశం వినిపించారు. బీజేపీ నేతలు వచ్చే ఎన్నికల్లో పోటీ చేయాలీ అంటే తాము పార్టీ పదవులు వదిలి తన సొంత నియోజకవర్గాలకు వెళ్ళాలని కూడా ఆయన సూచించారు. అలా నిర్ణయించుకున్న వారు ఒకటే రూల్ అని కూడా చెప్పేశారు. వారు ప్రస్తుతం తాము నిర్వహిస్తున్న పార్టీ బాధ్యతలకు పదవులకు ముందుగా రాజీనామా చేయాలని సునీల్ బన్సాల్ ఆదేశించడం విశేషం. పార్టీ పదవా లేక ఎన్నికల్లో పోటీనా ఏదో ఒకటి నిర్ణయించుకోవాలని ఆయన సూచించారు. పార్టీలో పనిచేసే వారికే పదవులు అని ఆయన కచ్చితంగా చెప్పారు. అలా ఎవరైనా పని చేయకపోతే పదవుల నుంచి తప్పుకోండి అని కూడా సూచించారు. పార్టీ నియమించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించని వారు క్షేత్రస్థాయిలో పని చేయలేని వారు వెంటనే తమ పదవుల నుంచి స్వచ్ఛందంగా తప్పుకోవాలని లేదంటే తామే బాధ్యతల నుంచి తప్పిస్తామని సునీల్ బన్సాల్ హెచ్చరించడం గమనార్హం. ఆఫీసులలో కూర్చుంటామంటే కుదరదని గ్రౌండ్ లెవెల్ లో పార్టీ కోసం పనిచేసే నాయకులే కావాలని ఆయన తేల్చేశారు. ఎవరైతే క్షేత్రస్థాయిలో కష్టపడతారో వారికి అవకాశం కల్పించడమే తమ ప్రాధాన్యత అని ఆయన స్పష్టం చేశారు. ఇక తెలంగాణాలో రానున్న గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికలు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలకు పార్టీ క్యాడర్‌ను సమాయత్తం చేసే వ్యూహంలో భాగంగానే సునీల్ బన్సాల్ ఈ కీలక సమావేశం నిర్వహించారు. ఇక మీదట తెలంగాణా విషయంలో పూర్తి ఫోకస్ ని కేంద్ర బీజేపీ నాయకత్వం పెడుతుందని అంటున్నారు. కేంద్ర నాయకులు ప్రధాని నరేంద్ర మోడీ హోంమంత్రి అమిత్ షా కూడా వరస పర్యటనలు తెలంగాణాలో చేస్తారు అని అంటున్నారు.

డిసెంబర్ నెలలో మోడీతో వరంగల్ లో భారీ బహిరంగ సభకు కూడా ప్లాన్ చేస్తున్నారు. దక్షిణాదికి గేట్ వేగా తెలంగాణాను భావిస్తున్న బీజేపీ నేతలు 2028లో జరిగే అసెంబ్లీ ఎన్నికలకు ఇప్పటి నుంచే పక్కా ప్లాన్ తో ముందుకు సాగాలని నిర్ణయించారు. ఈ క్రమంలోనే తెలంగాణా బీజేపీని యాక్టివ్ మోడ్ లో ఉంచాలని చూస్తున్నారు అని అంటున్నారు.

అక్టోబరు నుంచే నీటి ట్యాంకర్లు

హైదరాబాద్, అక్టోబరు 31 హైదరాబాద్‌లో సాధారణంగా వేసవి కాలంలో కనిపించే నీటి ట్యాంకర్ల డిమాండ్ ఈసారి అక్టోబర్‌లోనే పెరగడం ఆందోళన కలిగిస్తోంది. వర్షాకాలం ముగిసిన వెంటనే నీటి కోసం ట్యాంకర్లపై ఆధారపడాల్సిన పరిస్థితి రావడం నగర నీటి నిర్వహణపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. ఇదే పరిస్థితి కొనసాగితే వచ్చే 2027 వేసవిలో నీటి అవసరాలు మరింత పెరిగే అవకాశం ఉంది. నివేదికలో పేర్కొన్న గణాంకాల ప్రకారం, గత ఏడాది పోలిక కాలంలో 18,806గా ఉన్న ట్యాంకర్ బుకింగ్స్ ఈ ఏడాది అక్టోబర్‌లో 62,565కు చేరాయి. సాధారణంగా రోజుకు 800 నుంచి 1,500 వరకు ఉండే బుకింగ్స్ ప్రస్తుతం 5,000 నుంచి 8,000 వరకు నమోదవుతున్నట్లు సమాచారం. బోడుప్పల్, ఎల్‌బీ నగర్, మణికొండ వంటి ప్రాంతాల్లో ఈ పెరుగుదల ప్రత్యేకంగా పరిశీలించాల్సిన అంశం. హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు పరిధిలో రోజుకు సుమారు 585 మిలియన్ గ్యాలన్ల నీరు సరఫరా అవుతుండగా, నగర అవసరాలు 735 ఓఉఆగా అంచనా వేసినట్లు నివేదిక పేర్కొంది. ఈ లెక్కల ప్రకారం రోజుకు 150 ఓఉఆ అంతరం ఉంది. అయితే, ఈ గణాంకాల తేదీ, పరిధి, అధికారిక ఆధారాలను ప్రచురణకు ముందు ధ్రువీకరించాలి. వర్షపాతం తక్కువగా ఉండటం, భూగర్భజలాలు తగ్గడం, కొత్త నివాస ప్రాంతాలు పెరగడం నీటి అవసరాలపై ప్రభావం చూపవచ్చు. బోర్‌వెల్స్‌లో నీరు తగ్గితే అపార్ట్‌మెంట్లు, ఇళ్లకు ట్యాంకర్ల అవసరం పెరుగుతుంది. అయితే, బుకింగ్స్ పెరగడానికి ఈ కారణాలన్నీ ఎంతవరకు దోహదపడ్డాయో స్పష్టమైన సమాచారం అవసరం. సింగూర్, మంజీరా, ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ జలాశయాల నిల్వలు, కృష్ణా, గోదావరి వనరుల నుంచి అందే నీటి పరిమాణం వచ్చే వేసవి పరిస్థితిని నిర్ణయించడంలో కీలకంగా ఉంటాయి. ప్రస్తుతం ఉన్న సమాచారం ఆధారంగా నగరంలో తీవ్రమైన నీటి సంక్షోభం తప్పదని చెప్పలేం. రాబోయే వర్షాలు, జలాశయాల నిల్వలు, నీటి వినియోగం కూడా పరిస్థితిని ప్రభావితం చేస్తాయి. ఇప్పటి నుంచే చర్యలు అవసరం వర్షపు నీటిని ఒడిసిపట్టడం, భూగర్భజలాలను పెంచడం, పైపుల లీకేజీలను అరికట్టడం వంటి చర్యలకు ప్రాధాన్యం ఇవ్వాలి. శుద్ధి చేసిన మురుగునీటిని పరిశ్రమలు, నిర్మాణ రంగంలో ఉపయోగించడం ద్వారా తాగునీటిపై ఒత్తిడిని తగ్గించవచ్చు. అక్టోబర్‌లోనే పెరుగుతున్న ట్యాంకర్ డిమాండ్‌ను సాధారణ పరిణామంగా తీసుకోకూడదు. వచ్చే వేసవిలో ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలి. హైదరాబాద్ నీటి అవసరాలకు దీర్ఘకాలిక పరిష్కారాలు కనుగొనడమే ఇప్పుడు కీలకం

కేటీఆర్ లో మార్పుకు కారణం ఏమిటీ

హైదరాబాద్, అక్టోబరు 31 గులాబీ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఇటీవల కాలంలో పదేపదే ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పొగుడుతున్నారు. తాజాగా తెలంగాణ భవన్ లో జరిగిన విలేకరుల సమావేశంలో కేటీఆర్ చంద్రబాబు నాయకత్వాన్ని మరోసారి ఆకాశానికి ఎత్తేశారు. తెలంగాణ రాష్ట్రంలో కరువు తీవ్రంగా ఉందని.. ఏపీ రాష్ట్రంలో కూడా ఇలానే ఉన్నప్పటికీ.. చంద్రబాబు నాయుడు సమర్థవంతంగా పరిపాలిస్తున్న నేపథ్యంలో.. ఏపీలో కరువు అనేది కనిపించడం లేదని.. ప్రతికూల పరిస్థితులనూ తనకు అనుకూలంగా మార్చుకున్నారని.. అది చంద్రబాబు నాయకత్వానికి నిదర్శనం అని కేటీఆర్ అంటున్నారు. కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో కూడా కరువు ఉందని.. కానీ తెలంగాణలో దాని తీవ్రత అధికంగా కనిపిస్తోందని.. దీనంతటికీ ప్రధాన కారణం రేవంత్ రెడ్డి నిర్లక్ష్యమని కేటీఆర్ ఆరోపిస్తున్నారు.నీటిని సమర్థవంతంగా వాడుకోవడంలో చంద్రబాబు చాకచక్యాన్ని ప్రదర్శిస్తున్నారని.. రేవంత్ రెడ్డి నిర్లక్ష్యాన్ని చూపిస్తున్నారని.. ఏపీ రాష్ట్రంలో తక్కువ వర్షపాతం నమోదైనప్పటికీ.. నీటి నిల్వ.. నిర్వహణ విషయంలో చంద్రబాబు సమర్థత ప్రదర్శిస్తున్నారని.. రైతులను.. ప్రజలను ఆదుకుంటున్నారని కేటీఆర్ వివరించారు. తెలంగాణ రాష్ట్రంలో పుష్కలంగా నీరు ఉన్నప్పటికీ.. రేవంత్ రెడ్డి మూర్ఖత్వం వల్ల.. ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల.. ప్రణాళికలు లేకపోవడం వల్ల రైతులు ఇబ్బంది పడుతున్నారని కేటీఆర్ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజల సంక్షేమం అవసరం లేదని.. కమిషన్ ఇస్తే సరిపోతుందని కేటీఆర్ వివరించారు. ప్రభుత్వ పనితీరు మీద రాజగోపాల్ రెడ్డి చేసిన కామెంట్లు బలమైన నిదర్శనమని కేటీఆర్ అన్నారు.కొండ సురేఖ తనకు క్షమాపణ చెప్పిన తీరుని కూడా కేటీఆర్ ప్రస్తావించారు. నిజం నిలకడగా ఉంటుందని.. మొన్న ఒక పత్రిక.. ఇప్పుడు కొండా సురేఖ క్షమాపణలు చెప్పారని వివరించారు. ఆమె ఇచ్చిన వివరణ చూడలేదని.. లేఖను పరిశీలించిన తర్వాత.. తమ న్యాయ బృందంతో చర్చించి.. తదుపరి చర్యలు తీసుకుంటామని వివరించారు. రాజకీయంగా కక్ష సాధింపు చేసేందుకు.. తమపై అసత్యాలు ప్రచార చేసిన ప్రతి ఒక్కరు.. పశ్చాత్తాపంతో క్షమాపణలు చెప్పక తప్పదని కేటీఆర్ అన్నారు.కేటీఆర్ మీద ప్రభుత్వం ఫార్ములా ఈ రేస్ వ్యవహారంలో కేసు నమోదు చేసింది. దీనిపై కూడా కేటీఆర్ స్పందించారు. త్వరలోనే రేవంత్ బోనులో నిలబడక తప్పదని హెచ్చరించారు. పరిపాలన చేయడం చేతగాక ప్రతిపక్షాల మీద విమర్శలు చేస్తూ.. రేవంత్ కాలం గడుపుతున్నారని.. కరువులోన రైతులను ఆదుకోవడంలో రేవంత్ విఫలమయ్యారని.. ఇతర రాష్ట్రాల నుంచి నేర్చుకోవాల్సిన విధానాలను ఒంట పట్టించుకోవాలని సూచించారు. గతంలో చంద్రబాబును కేటీఆర్ విమర్శించారు. కెసిఆర్ కూడా విమర్శించారు. ఇప్పుడు వాస్తవం తెలుసుకొని చంద్రబాబు పరిపాలనను కొనియాడుతున్నారు. కేటీఆర్ విషయంలో సురేఖ కైతే ఏ విధంగా జ్ఞానోదయం కలిగిందో.. చంద్రబాబు విషయంలో కూడా కేటీఆర్ కు అదే విధంగా జ్ఞానోదయం కలిగిందని టిడిపి నేతలు అంటున్నారు.

2,202 మంది పోలీసులతో భారీ బందోబస్తు: తిరుపతి ఎస్పీ

తిరుపతి జిల్లాలో నవంబర్ 1న జరగనున్న ఐదు మున్సిపాలిటీల ఎన్నికలకు 2,202 మంది పోలీసులతో పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేసినట్లు ఎస్పీ సుబ్బారాయుడు తెలిపారు. ?ఓటర్లకు విజ్ఞప్తి: ఓటర్లు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా చర్యలు చేపట్టామన్నారు. ?భద్రతా సిబ్బంది వివరాలు: తిరుపతి, పుత్తూరు, నాయుడుపేట, సూళ్లూరుపేట, వెంకటగిరి మున్సిపాలిటీల పరిధిలో 8 మంది డిఎస్పీలులు, 26 మంది సిఐలు, 98 మంది ఎస్సైలతో పాటు రాపిడ్ యాక్షన్ ఫోర్స్ బృందాలను మోహరించినట్లు వెల్లడించారు

బీఆర్ ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ కుమార్ పైచంద్రాయన్ గుట్ట పోలీస్ స్టేషన్లో బోయ నగేష్ పిర్యాదు

హైద్రాబాద్ అక్టోబర్ 31:తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు ఎనుముల రేవంత్ రెడ్డి పై బీఆర్ ఎస్ నాయకులు ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ కుమార్ ,చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ తెలంగాణ రాష్ట్ర వాల్మీకి బోయ కార్పొరేషన్ వైస్ చైర్మన్ బోయ నగేష్ ఆధ్వర్యంలో శనివారం చంద్రయన్గుట్ట అసెంబ్లీ నియోజకవర్గం, చంద్రాయన్ గుట్ట పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు, వెంకటేష్ ముదిరాజ్, ప్రమోద్ రెడ్డి, అనిల్, షకీల్ దయాని, ఆమీర్ బింద్న?యాజ్, సుల్తాన్, మోహన్ రెడ్డి, మరియు ఇతర కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

భాగ్యనగరానికి కొత్త వైభవం -- అభివృద్ధికి మహావేగం!

(హెచ్. ప్రతాప్)

భాగ్యనగరం భవిష్యత్తుకు బంగారు బాటలు పడుతున్నాయి. దేశంలోనే ప్రముఖ ఐటీ, పారిశ్రామిక, వాణిజ్య కేంద్రంగా ఎదిగిన హైదరాబాద్ ఇప్పుడు అంతర్జాతీయ స్థాయి మహానగరంగా రూపుదిద్దుకునేందుకు సిద్ధమవుతోంది. నగరం, పరిసర ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన రూ.84,790 కోట్ల భారీ కార్యాచరణ ప్రణాళిక కొత్త అవకాశాలకు తెరతీయనుంది. మౌలిక సదుపాయాల విస్తరణతోపాటు ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడం దీని ప్రధాన లక్ష్యం.

హైదరాబాద్లో జరిగిన నారెడ్కో తెలంగాణ ప్రాపర్టీ షోలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఈ ప్రణాళికను వెల్లడించారు. ప్రతిపాదిత వ్యయంలో దాదాపు రూ.55 వేల కోట్ల పనులు డిజైన్లు, టెండర్లు, అమలు దశల్లో ఉన్నట్లు తెలిపారు. మెట్రోపాలిటన్ అభివృద్ధి సంస్థ, గ్రోత్ కారిడార్, మెట్రో రైలు తదితర వ్యవస్థల ద్వారా రవాణా, మౌలిక సదుపాయాల విస్తరణకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు.

నగరాభివృద్ధిలో తాగునీరు, పారిశుధ్యానికి ప్రత్యేక ప్రాధాన్యం కల్పించడం విశేషం. జలమండలి పరిధిలో రూ.15,849 కోట్ల పనులు ప్రతిపాదించారు. జీహెచ్ఎంసీకి రూ.4 వేల కోట్లు, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్కు రూ.2,500 కోట్లు, సైబరాబాద్ కార్పొరేషన్కు రూ.2,163 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. ఈ పెట్టుబడులు కార్యరూపం దాల్చితే తాగునీటి సరఫరా, మురుగునీటి నిర్వహణ, రహదారుల అభివృద్ధిలో గణనీయమైన మార్పులు సాధ్యమవుతాయి.

మూసీ పునరుజ్జీవనానికి తొలి దశలో రూ.7,500 కోట్లతో పనులు చేపట్టే ప్రణాళిక నగర పర్యావరణానికి కొత్త ఆశలు కల్పిస్తోంది. నదిలో కలిసే ప్రధాన మురుగునీటి కాలువల వద్ద శుద్ధి కేంద్రాల ఏర్పాటు ద్వారా కాలుష్యాన్ని నియంత్రించవచ్చు. మూసీ పరీవాహక ప్రాంతాలు పరిశుభ్రంగా మారితే ప్రజారోగ్యంతోపాటు పర్యాటక అవకాశాలు మెరుగుపడతాయి.

ప్రాంతీయ రింగ్రోడ్డు, మెట్రో విస్తరణ, భారత్ ఫ్యూచర్ సిటీ వంటి ప్రాజెక్టులు హైదరాబాద్ ఆర్థిక భవిష్యత్తుకు కీలకం కానున్నాయి. రవాణా సౌకర్యాలు మెరుగుపడితే ప్రయాణ సమయం తగ్గి వాణిజ్య కార్యకలాపాలు విస్తరిస్తాయి. నిర్మాణ, సేవా రంగాల్లో ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. శివారు ప్రాంతాల్లో పెట్టుబడులు విస్తరించడం ద్వారా నగరంపై జనాభా ఒత్తిడి కొంత తగ్గే అవకాశం ఉంటుంది.

అయితే మహానగర అభివృద్ధికి ఆకాశహర్మ్యాలు, విశాలమైన రహదారులే కొలమానాలు కావు. సామాన్యుడికి అందుబాటులో గృహవసతి, నిరంతర తాగునీరు, సమర్థమైన ప్రజారవాణా, పరిశుభ్రమైన పరిసరాలు, పచ్చదనం కూడా అంతే ముఖ్యం. ప్రకటించిన ప్రాజెక్టులను నిర్ణీత కాలవ్యవధిలో పూర్తి చేయడం, నాణ్యతను కాపాడడం, అభివృద్ధి ఫలాలను అన్ని ప్రాంతాలకు అందించడం అత్యవసరం.

హైదరాబాద్ ప్రపంచస్థాయి నగరంగా ఎదగడమే కాదు, ప్రతి పౌరుడూ సగర్వంగా జీవించగల ఆదర్శ మహానగరంగా అవతరించాలి. అదే ఈ భారీ అభివృద్ధి ప్రణాళికకు నిజమైన సార్థకత!

హయత్నగర్ గ్రామంలో ఘనంగా ఘనంగా బొడ్రాయి పండుగ ప్రథమ వార్షికోత్సవం

రంగా రెడ్డి అక్టోబర్ 31;రంగా రెడ్డి జిల్లా హయత్నగర్ గ్రామంలో ఘనంగా నబిశీల (భోడ్రాయి) పండుగ ప్రథమ వార్షికోత్సవ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమం లో " మీడియా ఫోకస్ " వార్త ప్రతిక అధినేత దోమలపల్లి నాగరాజు మరియు వారి కుటుంబ సభ్యులుతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వశించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాభిశిలా (బొడ్రాయి) పండుగ లో అందరూ పాల్గొని అమ్మవారి ఆశీషులు అందరి పైన ఉండాలని కోరారు, తెలంగాణ రాష్టం లో వర్షాలు బాగా కురవలి అలాగే రైతులు సుఖసంతోషాలతో ఉండాలి వారు కోరారు, వారితో తో పాటు గంగని రాము, గంగాని ప్రవీణ్ కళ్యాణ్ తదితరులు పెద్ద ఎత్తున ప్రజలు అందరూ పూజలు నిర్వహించారు.



ఎమ్మెల్సీ ఓటు నమోదులో పాల్గొన్న కంచర్ల రామకృష్ణారెడ్డి

మోత్కూరు, అక్టోబర్ 31 : నల్లగొండ-ఖమ్మం- వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు నమోదు కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు. మోత్కూరు మండలం దత్తప్పగూడెంలో పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఓటు నమోదు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. జిల్లాలోని అర్హులైన పట్టభద్రులందరూ ఫారం- 18 ద్వారా నవంబర్ 6 లోపు ఓటు నమోదు చేసుకోవాలని కోరారు, బీఆర్ఎస్ నాయకత్వం ముందుండి అర్హులైన అందరూ ఓటు నమోదు చేసుకునే విధంగా సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఎలుగు శోభ సోమయ్య, ఎమ్మెల్సీ ఓటు నమోదు ఇన్చార్జి ఉదయ్ కుమార్ రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు బండి వెంకటేష్, వార్డు మెంబర్లు బొడ్డు అవిలయ్య, బొడ్డు మహేశ్, మాజీ కో ఆప్షన్ ఎంపీటీసీ అష్రఫ్ జానీ, మాజీ వార్డ్ మెంబర్ ఎలుగు మచ్చగిరి, బీఆర్ఎస్వీ మండల ప్రధాన కార్యదర్శి నాయిని ఉపేందర్, పార్టీ నాయకులు గనగాని వెంకటయ్య, రహీం భాషా, బలిక భిక్షం, దేవసరి స్వామి, ముక్కెర్ల అశోక్, టింకు పాల్గొన్నారు.

అంబర్ పేట్ కొత్త సీఐగా కొత్తపల్లి ముత్తు బాధ్యతల స్వీకరణ

హైద్రాబాద్ అక్టోబర్ 31;అంబర్ పేట పోలీస్ స్టేషన్ కొత్త సీఐగా కొత్తపల్లి ముత్తు బాధ్యతల స్వీకరించారు.టాస్క్ ఫోర్స్ నుండి బదిలీ పై అంబర్ పెట్ కు వచ్చారు.ఇప్పటివరకు అంబర్ పేట సీఐగా విధులు నిర్వహిస్తున్న కిరణ్ కుమార్ ను సీపీ ఆఫీస్ కు అటాచ్ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్యులు జారీ చేశారు.ఈ ఈ సందర్భంగా సీఐ ముత్తు మాట్లాడుకూ.. అంబర్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతి భద్రతలను పరిరక్షన నా ప్రధాన లక్ష్యం అన్నారు.ముక్యంగా ప్రజలకు సత్వర న్యాయం అందించేందుకు చర్యలు తీసుకుంటానని తెలిపారు.ఏదైనా ప్రధాన సమస్య ఉంటే తనను నేరుగా కలువవచ్చు నన్నారు.

పత్తి రైతుని ఆదుకోండి

క్వింటాకి రూ 12,000-00 లు మద్దతు ధర రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించాలి

హైద్రాబాద్ అక్టోబర్ 31 ;రైతు సంక్షేమం అని గొప్పలు చెప్పుకునే ప్రభుత్వం , రైతు గోస పట్టించుకోకుండా రైతులను నట్టేట ముంచుతుందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకులు కొలను వేణుగోపాల్ రెడ్డి ధ్వజమెత్తారు. సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో ఈరోజు మండల పార్టీ అధ్యక్షుడు అవ్వారు సుబ్బారావు అధ్యక్షతన సమావేశం జరిగింది . ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకులు కొలను వేణుగోపాల్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మునుగోడు నియోజకవర్గంతో పాటు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పత్తి రైతులు తీవ్ర సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నారు .విత్తనాలు ఎరువులు పురుగుమందుల ధరలు విపరీతంగా పెరిగాయి . ఎల్నినో ప్రభావంతో వర్షాలు కురువక పత్తి పంట దిగుబడి గణనీయంగా పడిపోయింది . ప్రస్తుతం ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రైతు పెట్టిన పెట్టుబడికి గిట్టుబాటు కూడా కావడం లేదు కావున రాష్ట్ర ప్రభుత్వం పత్తికి క్వింటాలకు రూ12000-00 లు మద్దతు ధర ప్రకటించి, తేమ శాతం పేరుతో రైతులను వేధించకుండా రాష్ట్రవ్యాప్తంగా సీసీఐ కేంద్రాల ద్వారా పత్తిని పూర్తిగా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతే దేశానికి వెన్నెముక అని మరిచి రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తుందని , రైతుని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది కావున వెంటనే రూ 12000-00 లు మద్దతు ధర ప్రకటించి రైతులని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో రైతులందరినీ యకలుపుకొని పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ సమావేశంలో గుమ్మడి అంజిరెడ్డి, శ్రీపతి రామ్ రెడ్డి, గోపాల్ రెడ్డి,కాటేపల్లి వెంకటేశం, ముత్యాల బిక్షపతి, వావిళ్ళ సత్తయ్య, నర్రి నరసింహ, కద్దాల స్వామి, దుబ్బాక స్వామి, భగవంతు, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

రామగుండం పోలీస్ కమిషనరేట్లో ఘనంగా జాతీయ ఐక్యత దినోత్సవ వేడుకలు

పెద్దపల్లి/గోదావరిఖని, అక్టోబర్-31, ప్రజాబలం ప్రతినిధి: సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో జాతీయ ఐక్యత దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పోలీస్ అధికారులు, సిబ్బందితో కలిసి దేశ ఐక్యత, సమగ్రతను కాపాడేందుకు అంకితభావంతో పనిచేస్తామని ప్రతిజ్ఞ చేయించారు.ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, భారతదేశ తొలి హోంమంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి అయిన అక్టోబర్ 31వ తేదీని ప్రతి సంవత్సరం జాతీయ ఐక్యత దినోత్సవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జాతీయ ఐక్యత, సమగ్రతను కాపాడటం ప్రతి పౌరుడి బాధ్యత అని,సర్దార్ పటేల్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమాజంలో శాంతి, సామరస్యం, సోదరభావం పెంపొందించేందుకు రామగుండం పోలీస్ కమిషనరేట్ తరఫున పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని సీపీ అంబర్ కిశోర్ ఝా స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ కే.శ్రీనివాస్, సీసీఎస్ ఏసీపీ రవీందర్,ఏఆర్ ఏసీపీ ఆర్.ప్రతాప్, ఏఓ శ్రీనివాస్, సీసీఆర్బీ ఇన్స్పెక్టర్ గోపి,ఆర్ఐలు దామోదర్,శేఖర్, పెద్దన్న,మల్లేశం, రమేష్, కమ్యూనికేషన్ ఇన్స్పెక్టర్ రామ్ ప్రసాద్,సీపీఓ సూపరింటెండెంట్లు మనోజ్, ఇంద్రసేనారెడ్డి, సందీప్,సంధ్య,సీసీ సందీప్,సీపీఓ సిబ్బంది,స్పెషల్ పార్టీ సిబ్బంది,ఏఆర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వట్టినాగులపల్లిలో పేకాట స్థావరంపై పోలీసుల దాడి.. 27 మంది అరెస్ట్!

శేరిలింగంపల్లి, అక్టోబర్ 31: హైదరాబాద్ శివారులోని వట్టినాగులపల్లిలో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై గచ్చిబౌలి పోలీసులు దాడి చేశారు. పేకాట ఆడుతున్న 27 మందిని అరెస్ట్ చేసి, వారి నుంచి సుమారు రూ.10 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ది స్కై బై విహారా ఫామ్‌లో అందర్ బహార్ పేకాట నిర్వహిస్తున్నట్లు గుర్తించిన పోలీసులు ఈ దాడి చేపట్టారు. గచ్చిబౌలి ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ దాడిలో 27 మంది పట్టుబడ్డారు. ప్రాథమిక విచారణలో చిన్న యాదవ్ (బీఎన్ రెడ్డి నగర్), సోను (సన్‌సిటీ), నవీన్ అనే వ్యక్తులు గత నాలుగు నెలలుగా ఈ పేకాట స్థావరాన్ని నిర్వహిస్తున్నట్లు వెల్లడైనట్లు సమాచారం. ఈ స్థావరంలో ప్రతిరోజూ సుమారు రూ.20 లక్షల మేర పేకాట లావాదేవీలు జరుగుతున్నట్లు తెలిసింది. దాడిలో రూ.10 లక్షల నగదును స్వాధీనం చేసుకున్న పోలీసులు.. ఘటనపై మరింత విచారణ చేపట్టారు. పేకాట నిర్వహణకు సంబంధించి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

ముగ్గురు పోలీసు అధికారులకు ఘనంగా వీడ్కోలు.. పదవీ విరమణ సత్కారం

అందోల్ నియోజకవర్గం ప్రతినిధి అక్టోబర్ 31 (ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా : సంగారెడ్డి జిల్లా పోలీసు శాఖలో సుదీర్ఘకాలం విశిష్ట సేవలందించి పదవీ విరమణ పొందుతున్న ఎస్,ఐ, టి.నాగేశ్వర్ రావు, హెడ్ కానిస్టేబుళ్లు మహ్మద్ అబ్దుల్ బారీ,వి.సుధర్శన్‌లను, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్ ఘనంగా సత్కరించి, జ్ఞాపికలు అందజేసి ఆత్మీయ

వీడ్కోలు పలికారు,ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ,పోలీసు శాఖకు వారుఅందించిన సేవలు అభినందనీయమని, క్రమ శిక్షణతో ఎలాంటి ప్రతికూల రిమార్కులు లేకుండా విధులు నిర్వహించడంగొప్ప విషయమని, కొనియాడారు. పదవీ విరమణ అనంతరం వారు కుటుంబ సభ్యులతో ఆయురారోగ్యాలతో,

ప్రశాంతమైన జీవితం గడపాలని ఆకాంక్షించారు,ఈకార్యక్రమంలో అదనపు ఎస్పీ చైతన్యరెడ్డి, పోలీసు అధికారులు, సిబ్బంది, పదవీ విరమణ పొందిన వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఏటూరు నాగారం ఏరియా ఆసుపత్రిలో డయాలసిస్ మిషన్ల కొరత

ఇబ్బంది పడుతున్న డయాలసిస్ రోగులు

మరిన్ని మిషన్స్ పెంచాలని మంత్రిని కోరుతున్న రోగులు

ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 31 ఏటూరు నాగారం ఏటూరు నాగారం ఏరియా ఆసుపత్రిలో డయాల సిస్ రోగులకు మిషిన్లు లేక నాన్న ఇబ్బందులు పడుతున్నారు 25 మంది డయాలసిస్ రోగులకు చికిత్స అందుతుంది అందులో కొత్తగా మరో 30 మంది డయాలసిస్ పేషెంట్లు పేర్లు నమోదు చేసుకోగా మిషన్స్ లేకపోవడంతో వారిని హనుమకొండ కే ఎం సి కి పంపిస్తున్నారు దీనితో డయాలసిస్ పేషెంట్లు అక్కడికి వెళ్లలేక తనువు చాలిస్తున్నారు ములుగు జిల్లా మంత్రి సీతక్క చెరువ తీసుకొని మరిన్ని డయాల సిస్

మిషన్స్ ఏర్పాటు చేయాలని కోరు తున్నారు ఏటూరు నాగారంలో ఉన్న డయాలసిస్ సెంటర్ కి వాజేడు వెంకటాపురం మంగపేట తాడువాయి కన్నయ్య గూడెం ఏటూర్ నాగారం నుంచి భారీ ఎత్తున పేషెంట్లు పెరిగిపోతుండడం తో మెషిన్లు లేక నానా అవస్థలు పడుతున్నారు వెంటనే మంత్రి సీతక్క మరిన్ని మిస్సిన్స్ ఏర్పాటు చేసి గ్రామ ప్రాంత వాసులను ఆదుకోవాలని కోరుకుంటున్నాను

గోదావరి పుష్కరాల పెండింగ్ పనులు సకాలంలో పూర్తి చేయాలి : రాష్ట్ర దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్

పెద్దపల్లి, అక్టోబర్-31, ప్రజాబలం ప్రతినిధి: రానున్న గోదావరి పుష్కరాల పెండింగ్ పనులు సకాలంలో పూర్తి చేయాలని,రాష్ట్ర దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ అధికారులను ఆదేశించారు.

?శనివారం సాయంత్రం రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంత రావుతో కలిసి పలు జిల్లాల కలెక్టర్లతో దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. పెద్దపల్లి జిల్లా కలెక్టరేట్ నుంచి అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ మాట్లాడుతూ గోదావరి పుష్కరాల పనులను నాణ్య ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. నూతన పుష్కర ఘాట్ల నిర్మాణం, పాత ఘాట్ల మరమ్మతుల పనులు, ఇతర నిర్మాణ పనుల పురోగతిని జిల్లాల వారీగా సమీక్షించారు. పుష్కరాలకు తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సురక్షితమైన తాగునీరు అందించేందుకు స్పష్టమైన ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. పరిసరాల పరిశుద్ధ్యానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, నిర్మాణ పనులకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని తెలిపారు. అలాగే పుష్కర ప్రాంతాలలో భక్తులను ఆకట్టుకునేలా ఆకర్షణీయమైన లైటింగ్ ఏర్పాట్లు చేయాలని సూచించారు. ?ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో హెచ్ సెక్షన్ పర్యవేక్షకులు ఈశ్వర్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మదనపల్లెలో ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించిన డీఐజీ

మదనపల్లె: అన్నమయ్య జిల్లా కేంద్రం మదనపల్లెలో మున్సిపల్ ఎన్నికల ఏర్పాట్లను డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్ శనివారం పరిశీలించారు.స్థానిక జడ్పీ హైస్కూల్ ఆవరణలో ఏర్పాటు చేసిన ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని, పోలింగ్ కేంద్రాలను జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి, అడిషనల్ ఎస్పీ వెంకటాద్రి, డీఎస్పీ ప్రసాద్ లతో కలిసి తనిఖీ చేశారు. ఆదివారం జరిగే ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసులకు ఆదేశించారు.

బియ్యం ధరలపై పారదర్శకతకు ప్రత్యేక చర్యలు

హోల్‌సేల్, రిటైల్ దుకాణాల్లో ధరల బోర్డులు ఏర్పాటు చేయాలి

కృత్రిమ కొరతకు చెక్ పెట్టేందుకు

పౌరసరఫరాల శాఖ ఆదేశాలు

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం అక్టోబర్ 31: వినియోగదారులకు బియ్యం ధరల విషయంలో పారదర్శకత కల్పించేందుకు తెలంగాణ పౌరసరఫరాల శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. బియ్యం మార్కెట్‌లో కృత్రిమ కొరతను నివారించడంతో పాటు, వినియోగదారులకు విక్రయ ధరలపై స్పష్టత ఉండేలా చర్యలు చేపట్టింది.

ఈ మేరకు రాష్ట్రంలోని హోల్‌సేల్, రిటైల్ బియ్యం దుకాణాల్లో ధరలకు సంబంధించిన వివరాలను స్పష్టంగా కనిపించేలా బ్యానర్లపై ప్రదర్శించాలని పౌరసరఫరాల శాఖ కమిషనర్ ఆదేశించారు. ప్రతి దుకాణంలో వినియోగదారులకు సులభంగా కనిపించే ప్రదేశంలో ఈ వివరాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ధరల విషయంలో పారదర్శకత పాటిస్తూ, నిబంధనలకు అనుగుణంగా వ్యాపార కార్యకలాపాలు నిర్వహించాలని స్పష్టం చేశారు.



దేశ సమగ్రతకు పటేల్ స్ఫూర్తి చిరస్మరణీయం

కలెక్టరేట్‌లో రాష్ట్రీయ ఏక్తా దివస్ ప్రతిజ్ఞ

అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి

మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం, అక్టోబరు31: దేశ ఐక్యత, సమగ్రత, భద్రత పరిరక్షణలో సర్దార్ వల్లభాయ్ పటేల్ అందించిన సేవలు భావితరాలకు స్ఫూర్తిదాయకమని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి పేర్కొన్నారు. పటేల్ జయంతిని పురస్కరించుకుని శనివారం కలెక్టరేట్‌లో రాష్ట్రీయ ఏక్తా దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా రెవెన్యూ అధికారి మాలతితో కలిసి అదనపు కలెక్టర్ అధికారులు, ఉద్యోగులతో ఐక్యతా ప్రతిజ్ఞ చేయించారు. దేశ ఐకమత్యం, సమగ్రత, భద్రతను కాపాడేందుకు అంకితభావంతో

పనిచేయాలని, సమాజంలో ఐక్యతా భావాన్ని మరింత బలోపేతం చేయాలని ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేయించారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆశయాలు, దార్శనికతకు అనుగుణంగా దేశ అంతర్గత భద్రతను పటిష్ఠం చేసేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యత నిర్వహించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ సీతారాం, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సీతక్క ప్రత్యేక చొరవతో హనుమాన్ ఆలయ నిర్మాణానికి నిధుల మంజూరు

ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 31 మంగపేట

ప్రజల అవసరాలకు తక్షణమే స్పందించే నాయకురాలు మంత్రి సీతక్క

పంచాయతీరాజ్ డైరెక్టర్ గుమ్మడి సోమయ్య

ములుగు జిల్లా మంగపేట మండలంలోని తిమ్మంపేట ఆవాస ప్రాంతమైన బీసీ కాలనీ కూడలి వద్ద నిర్మించనున్న శ్రీ హనుమాన్ ఆలయ నిర్మాణం కోసం అనువైన స్థలాన్ని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు.ఆలయ నిర్మాణానికి మంత్రి సీతక్క ప్రత్యేక చొరవతో నిధులు మంజూరు కావడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ డైరెక్టర్ గుమ్మడి సోమయ్య మాట్లాడుతూ,ప్రజలకు ఏ సమస్య వచ్చినా తక్షణమే స్పందించి,వాటి పరిష్కారానికి బాధ్యతాయుతంగా కృషి చేసే ప్రజానాయకురాలు మంత్రి శ్రీమతి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క అని కొనియాడారు.

బీసీ కాలనీలో హనుమాన్ ఆలయ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరిన వెంటనే మంత్రి సీతక్క సానుకూలంగా స్పందించి నిధులు మంజూరు చేయడం అభినందనీయమని తెలిపారు.ప్రజల ఆధ్యాత్మిక అవసరాలను గుర్తించి ఆలయ నిర్మాణానికి సహకరించడం సంతోషకరమైన విషయమని పేర్కొన్నారు.గుడి అయినా.. బడి అయినా ప్రజలకు అవసరమైన చోట నిర్మించాలన్నదే మంత్రి సీతక్క ఆలోచనా విధానమని గుమ్మడి సోమయ్య అన్నారు.ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగడం మనందరికీ గర్వకారణమని పేర్కొన్నారు .ఈ ఆలయ నిర్మాణం పూర్తయితే బీసీ కాలనీ ప్రజలకు ఆధ్యాత్మికంగా ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని నాయకులు అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో శ్రీ భద్రాచల సీతారామచంద్ర స్వామి దేవస్థానం డైరెక్టర్ పూజారి సురేందర్,ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు అయ్యోరి యానయ్య,మండల పార్టీ మాజీ అధ్యక్షులు మైల జయరాం రెడ్డి,బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు పెద్ది నరసింహారావు,ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు బసారీకారి హరికృష్ణ,ఏటూరు నాగారం ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ పగిడిపెల్లి వెంకటేశ్వర్లు,జిల్లా నాయకులు మాసిరెడ్డి వెంకటరెడ్డి,గ్రామ కమిటీ అధ్యక్షులు చిన్నపెల్లి రాంబాబు,గుండు నర్సయ్య, హనుమాన్ గుడి చైర్మన్ చిటమట రాజశేఖర్,తిమ్మంపేట గ్రామ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ముక్కెర రాజు,గడ్డం పరమేష్,బొంబోతుల మురళి,యగ్గడి అర్జున్,బోడ రామచంద్రం,ముక్కెర రజనీకాంత్,మల్లెల కమలాకర్,రెడ్డి పవన్,వడ్ల సంతోష్,కోటి రామ్,తాటి నరసింహారావు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

అంగన్వాడీ టీచర్లు, హెల్పర్ల పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూ తేదీలు ఖరారు చేసిన జిల్లా కలెక్టర్

ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 31 ములుగుములుగు జిల్లాలోని ఐసీడీఎస్ తాడ్వాయి మరియు వెంకటాపురం ప్రాజెక్టుల పరిధిలో ఖాళీగా ఉన్న 31 అంగన్వాడీ టీచర్ పోస్టులు, 104 అంగన్వాడీ హెల్పర్ పోస్టుల భర్తీకి జారీ చేసిన నోటిఫికేషన్ ఆధారంగా అర్హులైన అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించుటకు శ్రీయుత జిల్లా కలెక్టర్ గారు అనుమతి తెలిపినారు.

1.తాడ్వాయిప్రాజెక్ట్ అంగన్వాడీ టీచర్ పోస్టులు: 04.11.2026ఉ:11.0 గంటల నుండిసా: 4.00 గం:వరకు

2.వెంకటాపురం ప్రాజెక్ట్ అంగన్వాడీ టీచర్ పోస్టులు:05.11.2026 ఉ:11.00 గంటలనుండి సా:4.00గం: వరకు

3.తాడ్వాయి ప్రాజెక్ట్ అంగన్వాడీ హెల్పర్ పోస్టులు:06.11.2026 ఉ: 11.00 గంటలనుండి సా:4.00గంటల వరకు

4.వెంకటాపురం ప్రాజెక్ట్ అంగన్వాడీ హెల్పర్ పోస్టులు:07.11.2026 ఉ: 11.00 గంటలనుండి సా 4.00 గం వరకు

పై తేదీలలో ములుగులోని ఐడీఓసీ (×ణూజ) కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఇంటర్వ్యూలు నిర్వహించబడతాయి. కావున సంబంధిత సి.డి.పి.ఓ ఆఫీస్ నందు ఒరిజినల్ సర్టిఫికెట్స్ పరిశీలనలో అర్హులని ధ్రువీకరించబడిన వారు మాత్రమే, పైన తెలిపిన తేదీలలోనిర్ణీత సమయానికి ఇంటర్వ్యూలకు హాజరు కావాలని శ్రీయుత జిల్లా సంక్షేమ అధికారి శ్రీమతి ఈ.పి. ప్రేమలత గారు సూచించారు. అర్హుల జాబితాను సంబంధిత మండల పంచాయతీ, మండల తహశీల్దార్, మరియు సి.డి.పి.ఓ కార్యాలయాల్లో మీసమాచార నిమిత్తంఉంచబడినయని తెలియజేయుచున్నాము.

ఎన్ హెచ్ ఎం ఉద్యోగుల మోకాళ్లపై నిరవధిక సమ్మె

ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 31 ఏటూరు నాగారం తెలంగాణ రాష్ట్రంలో ఎన్ హెచ్ ఎం ఉద్యోగుల నిరావాదిక సమ్మెలో భాగంగా 19 రోజు ఎన్ హెచ్ ఎం జేఏసీ సభ్యురాలు సుకన్య ఆధ్వర్యంలో ఏటూరు నాగారం ఏరియా ఆసుపత్రిలో నేషనల్ హెల్త్ మిషన్ లో పనిచేస్తున్న ఉద్యోగులందరూ మోకాల పై నిరవధిక సమ్మెకు పోనుకున్నారు జాతీయ ఆరోగ్య మిషన్ లో పనిచేస్తున్న 17,000 మంది ఉద్యోగులు అన్ని రకాల క్యాడర్లు సమ్మె ఈనెల 13 నుంచి ఉదృతం చేశారు గత 20 సంవత్సరాల నుంచి వెట్టి చాకిరి చేయించుకుంటున్న ప్రభుత్వాలను వెంటనే మా సమస్యలు పరిష్కరించాలని పెద్ద ఎత్తున 17వేల మంది ఉద్యోగులు రోడ్డుపై నిరవధిక సమ్మెకు పూనుకున్నారు గత ప్రభుత్వాలు ఎన్ హెచ్ ఎం ఉద్యోగులను పర్మినెంట్ చేసి ఉద్యోగ భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వాలు గద్దె దిగిపోవడంతో ఈరోజు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ హెచ్ ఎం ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని శాంతియుత సమ్మెకు పూనుకున్నారు కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగుల సమస్యల పరిష్కరిస్తారని ఉద్యోగ భద్రత కల్పిస్తారని రేవంత్ రెడ్డి ప్రభుత్వం పై ధీమాగా ఉన్నారు ఇప్పటికైనా రేవంత్ రెడ్డి ప్రభుత్వం వెంటనే జాతీయ ఆరోగ్యం మిషన్ లో ఉద్యోగాలు చేస్తున్న 17వేల మంది ఉద్యోగులకు రెగ్యులరేషన్ చేస్తూ ఉద్యోగ భద్రత కల్పిస్తూ పెంచిన జీతాలు వెంటనే విడుదల చేయాలని మహిళలకు వేతనంతో కూడిన 180 రోజుల ప్రస్తుత దినాలు కల్పించాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు

ఈ కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్ డిఇఓ బ్లడ్ బ్యాంక్ నర్సింగ్ సిస్టర్స్ ఎఫ్ ఎన్ ఓ లు ఎస్ ఎన్ సి యు సిస్టర్స్ సపోర్టింగ్ స్టాఫ్ సెక్యూరిటీ కాంటిజన్స్ వర్కర్స్ శ్వేత స్రవంతి దివ్య మమత మానస కౌసల్య నిర్మల సత్యవతి దేవరాజ్ కృష్ణ యశోద చిన్నన్న మురళి సంపత్ వెంకట్ భరత్ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు

డిగ్రీ కళాశాలలో ఘనంగా జాతీయ ఐక్యత దినోత్సవం.

ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 31 ఏటూరు నాగారం మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నందు చరిత్ర విభాగం ఆధ్వర్యంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి ని పురస్కరించుకొని " జాతీయ ఐక్యత దినోత్సవం " నిర్వహించారు. ఈ కార్యక్రమం ను ప్రిన్సిపల్ డాక్టర్. బి. రేణుక మరియు అధ్యాపక బృందం పటేల్ చిత్రపటానికి పూలమాల ధారణ చేసి నివాళులు అర్పించారు ప్రిన్సిపల్ మాట్లాడుతూ వల్లభాయ్ పటేల్ గొప్ప ధైర్యశాలి అని ఆయన దేశానికి అందించిన సేవలను కొనియాడారు. అనంతరం చరిత్ర విభాగాధిపతి సి హె చ్ వెంకటయ్య మాట్లాడుతూ భారత స్వతంత్ర సమయంలో 560 కి పైగా ఉన్న సంస్థానాలను ఏకం చేయడంలో పటేల్ కృషి, ఆయన చూపిన తెగువ మరియు రాజనీతి అనన్య సామాన్య మని, విద్యార్థులందరూ వారు చూపిన మార్గంలో నడవాలని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు జ్యోతి, ఫాతిమా, సంపత్, భాస్కర్, రమేష్, శ్రీధర్, జీవ వేణి, భారతి, శ్రీకాంత్, శేఖర్, ప్రశాంతి, మరియు బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సింగూరు ప్రాజెక్టు నుండి త్రాగునీటి అవసరాల కోసం నీటిని విడుదల

అందోల్ నియోజకవర్గం ప్రతినిధి అక్టోబర్ 31 (ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా : పుల్కల్ మండల పరిధిలో గల సింగూరు ప్రాజెక్టు నుండి, ఈరోజు శనివారం మధ్యాహ్నం 1.55. గంటలకు సింగూరు ప్రాజెక్టు నుండి దిగువన ఉన్న మంజీరా బ్యారేజ్ కు త్రాగునీటి అవసరల నిమిత్తం ప్రాజెక్టుగేట్ లు 4.6,7, గేట్ల ద్వారా 1.5 మీటర్ల ఎత్తు లేపి దిగువకు(,0.15) టీఎంసీల నీటిని విడుదల చేశారు, నీటిని దిగువకు విడుదల చేసే ముందు ప్రాజెక్టు అధికారులు, మంజీరా పరివాహక ప్రాంత ప్రజలు, పశువుల కాపరులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేశారు

బాలలకు చట్టాలపై అవగాహన తప్పనిసరి విద్యార్థులకు న్యాయమూర్తుల సూచన

జహీరాబాద్, అక్టోబరు 31 ప్రజా బలం ప్రతినిధి: బాలలు చిన్నతనం నుంచే చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ ఛైర్‌పర్సన్ జి. కవితాదేవి సూచించారు. సురక్ష బచపన్ అభియాన్‌లో భాగంగా శనివారం నాలందా, హీరా పాఠశాలల్లో ఆమె విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. సంఘమిత్ర పాఠశాలలో అదనపు జూనియర్ సివిల్ జడ్జి బ్లెస్సి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తులు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో మెలుగుతూ చదువుపై శ్రద్ధ వహించాలని సూచించారు. పెద్దలను, తోటివారిని గౌరవించాలని, విద్యతోపాటు సాధారణ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని తెలిపారు. ప్రతి విద్యార్థి ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని, దాని సాధనకు ఉపాధ్యాయుల సహకారం తీసుకుంటూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఎలాంటి చెడు వ్యసనాలకు లోనుకాకుండా భవిష్యత్తుపై దృష్టి సారించాలని చెప్పారు.

బాలికల భద్రతపై అవగాహన

బాలికలు, మహిళల పట్ల అసభ్యంగా లేదా దురుసుగా ప్రవర్తించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటారని న్యాయమూర్తులు వివరించారు. విద్యార్థినులు ముఖ్యంగా లైంగిక నేరాలకు సంబంధించిన చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్ మధ్య తేడాలను వివరిస్తూ, అనుచిత ప్రవర్తన ఎదురైతే భయపడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా సంబంధిత అధికారులకు తెలియజేయాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బాల్యవివాహాల నిరోధక చట్టం, బాలలపై లైంగిక నేరాల నుంచి రక్షణ కల్పించే చట్టాలపై వివరించారు. బాలల హక్కులు, వారి భద్రతకు చట్టాలు కల్పిస్తున్న రక్షణ గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమాల్లో న్యాయవాదులు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది, పారాలీగల్ వాలంటీర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో ఘనంగా సర్దార్ వల్లభాయ్ పటేల్ 151వ జయంతి వేడుకలు

జాతీయ ఐక్యతా దినోత్సవం సందర్భంగా ఐక్యతా ప్రతిజ్ఞ

రంగారెడ్డి ప్రజాబలం ప్రతినిధి:దేశ సమగ్రత, ఐక్యత, సమైక్యతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, జాతీయ ఐక్యతా స్ఫూర్తిని పెంపొందిస్తూ దేశ సమగ్రతను పరిరక్షించేందుకు నిరంతరం కృషి చేయాలని జిల్లా కలెక్టర్ అన్నారు.

శనివారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో భారత ఉక్కుమనిషి, స్వాతంత్ర్య సమరయోధుడు, భారత తొలి ఉప ప్రధానమంత్రి, తొలి హోంమంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ 151వ జయంతిని పురస్కరించుకొని జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి పాల్గొని సర్దార్ వల్లభభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, సర్దార్ వల్లభాయ్ పటేల్ దేశ ఐక్యత, సమగ్రతకు ప్రతీకగా నిలిచారని, స్వాతంత్ర్యం అనంతరం దేశంలోని 500కు పైగా సంస్థానాలను భారతదేశంలో విలీనం చేసి, జాతీయ సమైక్యతను బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషించారని తెలిపారు. దేశాన్ని ఐక్యంగా, బలంగా తీర్చిదిద్దడంలో ఆయన చూపిన నాయకత్వం, దూరదృష్టి, దేశభక్తి చిరస్మరణీయమని అన్నారు.

దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ పోషించిన కీలక పాత్రను, స్వాతంత్ర్యం అనంతరం దేశ సమైక్యత కోసం చేసిన విశేష కృషిని ఈ సందర్భంగా స్మరించుకున్నారు. ఆయన ఆశయాలు, ఆదర్శాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని, దేశ ఐక్యత, సమగ్రత, భద్రతను కాపాడుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని తెలిపారు. సర్దార్ వల్లభభాయ్ పటేల్ ఆశయాలను ఆదర్శంగా తీసుకొని ప్రజలకు సమర్థవంతమైన సేవలు అందిస్తూ, దేశ అభివృద్ధి, జాతీయ సమైక్యతకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు.

జాతీయ ఐక్యతా దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్, అధికారులు, ఉద్యోగులు, సిబ్బందిచే "దేశ ఐక్యత, సమగ్రత, భద్రతను కాపాడేందుకు అంకితభావంతో పనిచేస్తామని, ప్రజల మధ్య సోదరభావం, సామరస్యం, ఐక్యతను పెంపొందించేందుకు కృషి చేస్తామని" జాతీయ ఐక్యతా ప్రతిజ్ఞ చేయించారు.

ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ లోని వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా లింగ దీక్ష మహోత్సవాలు

సిద్దేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు.. నేడు లక్ష పుష్పార్చన

జహీరాబాద్, అక్టోబర్ 31 ప్రజాబలం ప్రతినిధి: పట్టణంలోని సిద్దేశ్వరాలయంలో జంగమ సమాజం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న లింగ దీక్ష మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేద మంత్రోచ్ఛరణల నడుమ ఆరుద్రోత్సవాలు, పూర్ణాహుతి కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో జరిపారు. ఈ సందర్భంగా స్థానిక సీనియర్ సివిల్ జడ్జి కవితా దేవి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ శిరీష సురేందర్ రెడ్డి పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి విచ్చేసిన భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

ఆలయ ఈవో శివ రుద్రప్ప, ఉత్సవ కమిటీ సభ్యులు, జంగమ సమాజం ప్రతినిధులు, మహిళలు, భక్తులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

నేడు లక్ష పుష్పార్చన

లింగ దీక్ష మహోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉజ్జయిని జగద్గురువుల ఆధ్వర్యంలో లక్ష పుష్పార్చన, రుద్రాభిషేకం తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమాలకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై జగద్గురువుల ఆశీస్సులు పొందాలని వారు కోరారు.

దేశ సమైక్యత, సమగ్రతల కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలి.

ఏకత్వానికి ప్రతిరూపమే జాతీయ ఐక్యతా దినోత్సవం.

అదనపు కలెక్టర్ రెవిన్యూ సి.హెచ్.మహేందర్ జి.

ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 31 కలెక్టరేట్శనివారం సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి జిల్లా అదనపు కలెక్టర్లు పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు.

దేశాన్ని ఐకమత్యంగా ఉంచడంలో కృషిచేసిన ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని జాతీయ ఐక్యత దినోత్సవం గా నిర్వహించుకుంటున్నామని , దేశానికి దిశ, నిర్దేశం చేసిన ఆయన చిరస్మరణీయూడని అన్నారు.

అనంతరం దేశ ఐకమత్యం,సమగ్రత,భద్రతను కాపాడటానికి స్వయంగా అంకిత మవుతానని,దేశ అంతర్గత భద్రతను పటిష్ట పరచడానికి స్వీయ తోడ్పాటు నందిస్తానని అదనపు కలెక్టర్ అధికారులు, ఉద్యోగుల చే రాష్ట్రీయ ఏక్తా దినోత్సవ ప్రతిజ్ఞను చేయించారు ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

నిజాయితీ ప్రతి ఒక్కరి బాధ్యత అవినీతి రహిత సమాజమే మన లక్ష్యం.

అవినీతి నిరోధక వారోత్సవాలు -2026 సందర్భంగా అవగాహన కార్యక్రమం. లోఏసీబీ డి.ఎస్.పి సాంబయ్య

అక్టోబర్ 26 నుంచి నవంబర్ 01 తేదీ వరకు నిర్వహిస్తున్న సత్యా నిష్ట తో సమృద్ధి అనే నినాదంతో శనివారం సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో అవినీతి నిరోధక శాఖ (ఏ సి బి), వరంగల్ రేంజ్ డీఎస్పీ సాంబయ్య ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా పాల్గొన్న అధికారులు, సిబ్బందితో “అవినీతికి దూరంగా ఉంటూ, విధి నిర్వహణలో నిజాయితీ, నిష్పక్షపాతంగా వ్యవహరిస్తూ, అవినీతి రహిత సమాజ నిర్మాణానికి కృషి చేద్దాం” అంటూ ప్రతిజ్ఞ చేయించారు.

ప్రభుత్వ ఉద్యోగులు తమ విధులను నిజాయితీతో, నిష్పక్షపాతంగా, బాధ్యతాయుతంగా నిర్వహించాలని, ప్రభుత్వ అధికారులను వ్యక్తిగత ప్రయోజనాల కోసం దుర్వినియోగం చేయరాదని సూచించారు. అవినీతి వల్ల సమాజంపై పడే ప్రతికూల ప్రభావాన్ని వివరించారు. అవినీతిని నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా వ్యవహరించాలని, ప్రభుత్వ సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సేవలు మరియు ప్రభుత్వ వ్యవస్థలపై ప్రజలకు విశ్వాసం కల్పించేలా పనిచేయాలని పేర్కొన్నారు.

ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగి లంచం డిమాండ్ చేసినా, అవినీతికి పాల్పడినా వెంటనే ఏసీబీ టోల్‌ఫ్రీ నంబర్ 1064కు ఫిర్యాదు చేయాలని సూచించారు.

ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ రెవిన్యూ సి. హెచ్. మహేందర్ జీ మాట్లాడుతూ, అవినీతి రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ప్రభుత్వ ఉద్యోగి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, నిజాయితీ మరియు నైతిక విలువలను పాటిస్తూ దేశ అభివృద్ధికి సహకరించాలని పిలుపునిచ్చారు. అవినీతిని నివారించడంలో పారదర్శకమైన పరిపాలన, సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, అక్రమాలకు తావులేని విధానాలు, ఫిర్యాదులపై సత్వర చర్యలు కీలకమని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు, సంపత్ రావు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రాత్రి ద్విచక్ర వాహనం అదుపుతప్పి రోడ్డుపై పడిపోయిన చెట్టును ఢీకొని మృతి చెందిన యువకుడు

ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 31 మంగపేట ఏటూరు నాగారం మండల కేంద్రానికి చెందిన ఎస్కే మిరాజ్ 30 సంవత్సరాలు సెల్ షాప్ నిర్వాహకుడు నిన్న రాత్రి సెల్ షాప్ మూసుకొని తిమ్మంపేట ఐనా మామ గారింటికి వెళ్లే క్రమంలో తిమ్మంపేట మూలమలుపు వద్ద రోడ్డుపై పడి ఉన్న చెట్టును ఢీకొని పక్కన ఉన్న పొలంలో పడిపోయాడు తెల్లవారుజామున రోడ్డుపై వెళ్తున్న బాటసారులు మృతి చెందిన వ్యక్తిని ప్రదేశాన్ని చూసి స్థానిక పోలీసులకు సమాచారం అందజేశారు వెంటనే పోలీసు అధికారులు సంఘటన స్థలం కు చేరుకొని మృతి చెందిన వ్యక్తి సమాచారం తెలుసుకోవడం జరిగింది ఏటూరు నాగారం కు చెందిన మిరాజ్ గా గుర్తించి సంబంధించిన బంధువులకు తెలపడంతో బంధువులు ఏటూరు నాగారం సామాజిక వైద్యశాలకు తరలించారు ఈ సంఘటన రాత్రి 11 గంటలకు జరిగినట్లు తెలుస్తుంది చెట్టును తాను గుద్దు కున్నాడా లేక వేరే వాహనం ఢీ కొట్టిందా అనే దానిపై స్థానిక ఎస్సై సూరి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

సర్కారు బడిలోనే విద్యార్థినులకు రక్షణ లేదు: వైసీపీ

అనంతపురం రాప్తాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థినిపై ఓ ఉన్మాది రంపంతో దాడి చేసిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై వైసీపీ తీవ్రంగా స్పందించింది. శనివారం ఎక్స్ వేదికగా.. ‘మీ ప్రభుత్వంలో సర్కారు బడిలోనే విద్యార్థినులకు రక్షణ లేదా చంద్రబాబు? రాప్తాడులో కట్టెలు కోసే మిషన్‌ను స్కూల్‌లోని క్లాస్‌రూంకి తీసుకెళ్లి విద్యార్థిని ముఖంపై, కుడిచేతిపై కోస్తుంటే.. సిబ్బంది ఏం చేస్తున్నారు?

7 హిల్స్ ఆస్తుల పరిరక్షణకు బి.ఆర్.ఎస్ మద్దతు

గండిపేట మండలం ప్రజాబలం ప్రతినిధి 31 అక్టోబర్ 2026మాజీ మంత్రి హరీష్ రావు, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, పట్లోళ్ల కార్తీక్ రెడ్డి, సుధీర్ రెడ్డి, దాసోజు శ్రవణ్ తదితర భారత రాష్ట్ర సమితి రాష్ట్ర నాయకులు నార్సింగి పరిధిలోని 7 హిల్స్ కమ్యూనిటీ వారు 2026 మాస్టర్ ప్లాన్‌లో ప్రతిపాదించిన రోడ్డు విస్తరణ కారణంగా ఇళ్లు, భవనాలు కోల్పోయే బాధితులను కలిసి వారి సమస్యలను,

ఆవేదనను తెలుసుకుని కమ్యూనిటీలో నిర్వహించిన సమావేశనికి, 7 హిల్స్ కమ్యూనిటీ బాధితులకు అండగా బీ.ఆర్.ఎస్ పార్టీ మణికొండ నాయకులు, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనడం జరిగినది. బాధితుల ఆస్తుల పరిరక్షణ పోరాటంలో భాగంగా పట్లోళ్ల కార్తీక్ రెడ్డి మాట్లాడుతూ 2013 మాస్టర్ ప్లాన్‌లో జనావాసాలకు ఇబ్బంది కలగకుండా ప్రతిపాదించిన 100 అడుగుల రోడ్డు అలైన్‌మెంట్‌ను ఇప్పుడు ఎందుకు మార్చారు ? ఎవరి ప్రయోజనాల కోసం ఈ మార్పులు చేశారు ? అని ప్రశ్నిస్తూ రాధా రియాల్టీకి సంబంధించిన వ్యక్తి తక్కువ ధరకు కొనుగోలు చేసిన భూములకు అనుకూలంగా రోడ్డు అలైన్‌మెంట్ మార్చారనే ఆరోపణలు ఉన్నాయని, ఈ మార్పుల వెనుక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాత్రపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. స్వార్థ ప్రయోజనాల కోసం ఎన్నో ఏళ్లుగా నివసిస్తున్న సామాన్య ప్రజల ఇళ్లను కూల్చివేసే ప్రయత్నాలను సహించేది లేదని బాధితులకు అండగా నిలబడి, వారి హక్కులు, ఆస్తుల పరిరక్షణ కోసం బీ.ఆర్.ఎస్ పార్టీ తరపున పోరాడుతా అని ప్రజలకు అన్యాయం జరగకుండా, ప్రతి బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు మా పోరాటం కొనసాగుతుందని హామీ ఇవ్వడం జరిగినది.

ఘనంగా కొమరం భీమ్ 86వ వర్ధంతి

500 మందితో ఆదివాసీల భారీ ర్యాలీ

సాంప్రదాయ నృత్యాలు,

సన్నాయి మేళాలతో హోరెత్తిన కన్నాయిగూడెం

ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 31 కన్నాయిగూడెం ,చలో హైదరాబాద్ డిసెంబర్ 9 భారీ బహిరంగ సభ తరలి రావాలని భారీ ఎత్తున ర్యాలీ కన్నాయిగూడెం మండల కేంద్రంలో తుడుం దెబ్బ కమిటీ ఆధ్వర్యంలో ఆదివాసీ వీరుడు, జల్--జంగల్--జమీన్ నినాద స్ఫూర్తిప్రదాత కొమరం భీమ్ 86వ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

ముత్యాలమ్మ గుడి వద్ద ముఖ్య అతిథులుగా విచ్చేసిన తుడుం దెబ్బ జాతీయ ఉపాధ్యక్షులు పొడెం బాబు, ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు కొప్పుల రవి, సమ్మక్క ప్రధాన పూజారి సిద్ధబోయిన స్వామి కొబ్బరికాయలు కొట్టి ర్యాలీలో పాల్గొన్నారు

. ఈ ర్యాలీని ట్రైబల్ వెల్ఫేర్ డీడీ, ఏటూరునాగారం ప్రారంభించారు.

ఈ ర్యాలీలో కన్నాయిగూడెం మండలంలోని వివిధ గ్రామాల నుంచి సుమారు 500 మంది ఆదివాసీ ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా సన్నాయి మేళాలు, సాంప్రదాయ నృత్యాలతో సుమారు కిలోమీటరున్నర మేర భారీ ర్యాలీ నిర్వహిస్తూ కొమరం భీమ్ విగ్రహం వద్దకు చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో కన్నాయిగూడెం తహసీల్దార్, ఎంపీడీవో పాల్గొని ర్యాలీలో భాగస్వాములయ్యారు. అనంతరం కొమరం భీమ్ విగ్రహానికి జాతీయ, రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామ కమిటీల నాయకులు, ఆదివాసీ ప్రజలు ఘనంగా నివాళు లర్పించారు.

ఈ కార్యక్రమానికి గుండ్ల పాపారావు, నల్లబోయిన కోటి అధ్యక్షత వహించారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు:

పొడెం బాబు -- తుడుం దెబ్బ జాతీయ ఉపాధ్యక్షులు

కొప్పుల రవి -- ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు

సిద్ధబోయిన స్వామి -- సమ్మక్క ప్రధాన పూజారి

పులిశె బాలకృష్ణ -- తుడుం దెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షులు

మల్లెబోయిన లక్ష్మణరావు -- తుడుం దెబ్బ ములుగు జిల్లా అధ్యక్షులు

దబ్బగట్ల శ్రీకాంత్ -- ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు

అట్టం శివకుమార్ -- తుడుం దెబ్బ వాజేడు మండల అధ్యక్షులు

అలాగే తుడుం దెబ్బ జాతీయ, రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామ కమిటీల నాయకులు, ఆదివాసీ సంఘాల ప్రతినిధులు, విద్యార్థులు, మేధావులు, ఆదివాసీ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కొమరం భీమ్ ఆశయాలు, ఆదివాసీ హక్కులు, జల్--జంగల్--జమీన్ నినాద స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ ముందుకు తీసుకెళ్లాలని ఈ సందర్భంగా నాయకులు పిలుపునిచ్చారు.

పదో తరగతి పరీక్ష పత్రాల వేలానికి టెండర్లు

రూ.10 వేల డిపాజిట్‌తో బిడ్లు దాఖలు చేయాలి

నవంబరు 3న టెండర్ల స్వీకరణ, పరిశీలన,జిల్లా విద్య శాఖ అధికారి రేణుకా దేవి

మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం, అక్టోబరు 31: పదో తరగతి మార్చి--2026 ప్రభుత్వ పబ్లిక్ పరీక్షలకు సంబంధించిన పరీక్ష పత్రాలను వేలం వేయాలని జిల్లా విద్యాశాఖ నిర్ణయించింది. ఈ మేరకు జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం టెండర్లకు ఆహ్వానం పలికింది. వేలం ప్రక్రియలో పాల్గొనాలనుకునే జిల్లాలోని రద్దీ కాగితాల వ్యాపారులు రూ.10 వేల డిపాజిట్ మొత్తాన్ని జిల్లా విద్యాశాఖాధికారి, మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా పేరుతో డిమాండ్ డ్రాఫ్ట్ రూపంలో తీసి, తమ కోట్ చేసిన ధరల వివరాలతో పాటు సీల్డ్ కవర్‌లో సమర్పించాల్సి ఉంటుంది. ఈ టెండర్లను నవంబరు 3న ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో స్వీకరించనున్నారు. అదే రోజు సాయంత్రం 4 గంటలకు టెండర్లను తెరవనున్నట్లు అధికారులు వెల్లడించారు.

తెలంగాణ విద్యుత్ ఉద్యోగులకు డీఏ పెంపు.. ప్రభుత్వం కీలక నిర్ణయం!

అందోల్ నియోజకవర్గం ప్రతినిధి అక్టోబర్ 31 (ప్రజాబలం) సంగారెడ్డి జిల్లా:తెలంగాణ విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు ప్రభుత్వం శుభవార్త అందించింది. ఉద్యోగుల కరవు భత్యం (డి ఏ)ను 19.2 శాతం నుంచి 21.8 శాతానికి పెంచుతూ నిర్ణయం తీసుకుంది. పెరిగిన (డీఏ) 2026 జూలై 1 నుంచి అమలు. మొత్తం 2.6 శాతం మేర డీఏ పెంపు, రాష్ట్రవ్యాప్తంగా 71,360 మందివిద్యుత్ఉద్యోగుల కు,ప్రయోజనంచేకూరనుంది.విద్యుత్ ఉద్యోగులకు ఈ డీఏ పెంపుతో వేతనాల్లో అదనపు ప్రయోజనం లభించనుంది....

నీటిని పొదుపుగా వినియోగించాలి.

తాగునీటి అవసరాలకు ప్రాధాన్యమివ్వాలి.

యాసంగి సాగుకు ముందు నీటి లభ్యతపై అధికారులను సంప్రదించాలి.

జిల్లా కలెక్టర్ బోర్డడే హేమంత్ సహదేవరావు.

ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 31 కలెక్టరేట్ రానున్న వేసవి అవసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రతి నీటి చుక్కను పొదుపు చేయాలని కోరారు.

జిల్లాలో వానాకాలం పంటలకు రామప్ప సరస్సు ద్వారా 5,180 ఎకరాలు, లక్నవరం సరస్సు ద్వారా 4,500 ఎకరాలు, పాలెంవాగు ప్రాజెక్టు ద్వారా 7,500 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించినట్లు తెలిపారు.

కన్నాయిగూడెం మండలం గంగారం గ్రామంలోని దేవాదుల పంపుహౌస్ ద్వారా జూలై 2026 నుంచి ఇప్పటివరకు సుమారు 16.50 టీఎంసీల నీటిని ఎత్తిపోసి, ఎత్తైన ప్రాంతాల సాగు, తాగునీటి అవసరాలకు మళ్లించినట్లు పేర్కొన్నారు. ఇకపై నీటి ఎత్తిపోతలు గోదావరిలో నీటి లభ్యతపై ఆధారపడి ఉంటాయని వివరించారు.

ప్రాజెక్టు కట్టల పటిష్టత, కాలువల నిర్వహణ, తూముల మరమ్మతులను నీటిపారుదల శాఖ అధికారులు పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. సరఫరా చేస్తున్న నీరు ఆయకట్టు చివరి భూములకు చేరేలా క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

యాసంగి సాగుపై రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి.

ప్రాజెక్టులు, చెరువులు, కుంటల్లో నీటి నిల్వలు తక్కువగా ఉన్నందున యాసంగి పంటలకు సాగునీరు విడుదల చేయడం కష్టతరంగా మారిందని కలెక్టర్ తెలిపారు. ఈ నేపథ్యంలో అందుబాటులో ఉన్న నీటిని తాగునీటి అవసరాలకు మాత్రమే వినియోగించే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోందని పేర్కొన్నారు. రైతులు ఈ పరిస్థితిని అర్థం చేసుకొని సహకరించాలని కోరారు.

యాసంగి సాగుకు సన్నద్ధమయ్యే ముందు నీటిపారుదల శాఖ అధికారులను సంప్రదించి, నీటి లభ్యత, విడుదల వివరాలను తెలుసుకోవాలని సూచించారు. దేవాదుల పంపుహౌస్‌ల నిర్వహణను పర్యవేక్షిస్తూ, గోదావరిలో నీటి లభ్యతకు అనుగుణంగా జలాశయాలు, చెరువులను నింపేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. రానున్న వేసవిలో ఎత్తైన ప్రాంతాల్లో నీటి కొరత తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.

ప్రజలు నీటిని వృథా చేయకుండా పొదుపుగా వినియోగించాలని కోరారు. పైపులైన్లలో లీకేజీలను గుర్తిస్తే సంబంధిత అధికారులకు

తెలియజేయాలని, నీటి సంరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

సమాచారం కోసం సంప్రదించాల్సిన అధికారులు:

యాసంగికి నీటి విడుదల మరియు ఆయకట్టుకు సరఫరా వివరాలు: సాగునీటికి సంబంధించిన సలహాల కోసం స్థానిక సహాయ ఇంజినీర్లు, ఉప కార్యనిర్వాహక ఇంజినీర్లను సంప్రదించాలని సూచించారు.

జిల్లా స్థాయిలో కింది అధికారులను సంప్రదించవచ్చని తెలిపారు.

బి. అప్పల నాయుడు, జిల్లా నీటిపారుదల అధికారి, ములుగు, ఫోన్: 9704678210

సీహెచ్. శంకరయ్య,కార్యనిర్వాహక ఇంజినీర్, ఏటూరునాగారం, ఫోన్: 9441653031

కె. నారాయణ, కార్యనిర్వాహక ఇంజినీర్, ములుగు, ఫోన్: 9492643623.

మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ ఘాటు వద్ద నివాళులర్పించిన ములుగు జిల్లా ఆత్మ కమిటీ చైర్మన్ చిటమట రఘు కాంగ్రెస్ నాయకులు

ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 31 ములుగు ఢిల్లీలో ఇందిరా గాంధీ గారి వర్ధంతి సందర్భంగా ఇందిరా గాంధీ ఘాటు వద్ద మ్యూజియం వద్ద నివాళులర్పించిన ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు జిల్లా చైర్మన్ మండల అధ్యక్షులు సర్పంచులు ఉప సర్పంచులు వార్డ్ మెంబర్ టౌన్ అధ్యక్షులు తదితరులు ఇందిరాగాంధీకి పుష్పగుచ్చాలతో నివాళులర్పించారు

ఈ కార్యక్రమంలో

చిటమట రఘు ములుగు జిల్లా ఆత్మ కమిటీ చైర్మన్

గద్దల నవీన్ సర్పంచ్ రామన్నగూడెం

బండారి లక్ష్మీ టౌన్ యూత్ అధ్యక్షులు ఏటూరునాగారం

పెద్ది రాజుకుమార్ మార్కెట్ కమిటీ డైరెక్టర్

ఆలం నాగార్జున కొండాయి సర్పంచ్

. ఏటూర్ నాగారం వర్కింగ్ ప్రెసిడెంట్ చైల వినయ్

. ఏటూర్ నాగారం యూత్ టౌన్ అధ్యక్షుడు

గంట ఠాగూర్

. ఏటూర్ నాగారం మండలం యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ సర్వసాయి

. శివపురం ఉపసర్పంచ్ వంగపల్లి రవి యాదవ

. ఏటూర్ నాగారం యూత్ టౌన్ వర్కింగ్ ప్రెసిడెంట్ కార్ల తరుణ్

కన్నాయిగూడెం మండలం

బొల్లె భాస్కర్ మాజీ వైస్ ఎంపీపీ

. ఆలం నాగార్జున ఉపసర్పంచ్ తుపాకులగూడెం

కుమ్మరి కుమార్

. జాడి నరేష్

. ఖయ్యూం తదితరులు పాల్గొన్నారు

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

జహీరాబాద్ రూరల్ సీఐ నర్సింలు

జహీరాబాద్, అక్టోబర్ 31 ప్రజాబలం ప్రతినిధి: ప్రస్తుత కాలంలో సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందుతున్న కొద్దీ సైబర్ నేరాలు పెరుగుతున్నాయని, విద్యార్థులు వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలని జహీరాబాద్ రూరల్ సీఐ నర్సింలు, హద్నూర్ ఎస్ఐ సుజిత్ సూచించారు. నాల్కల్ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ వసతి గృహంలో పోలీసులు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులు

మొబైల్ ఫోన్లు, సామాజిక మాధ్యమాలను వినియోగించేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, సందేశాలు, అనుమానాస్పద లింకులను తెరవవద్దని సూచించారు. బ్యాంకు ఖాతాలకు సంబంధించిన వివరాలు, ఓటీపీ, వ్యక్తిగత సమాచారాన్ని ఇతరులతో పంచుకోవద్దని హెచ్చరించారు. సైబర్ నేరగాళ్లు వివిధ మార్గాల్లో మోసాలకు పాల్పడుతున్నందున అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆన్‌లైన్ మోసానికి గురైతే ఆలస్యం చేయకుండా వెంటనే 1930 హెల్ప్‌లైన్ నంబరుకు ఫిర్యాదు చేయాలని సూచించారు. సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండటంతోపాటు, ఇతరులకు కూడా వాటి నివారణపై తెలియజేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రత్యేక అధికారి లలిత, వసతి గృహ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మర్పల్లి అర్హులైన పట్టభద్రులందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి

ఎమ్మార్వో మనోహర్ చక్రవర్తికి ఫారం-18 దరఖాస్తులు అందజేసిన శ్రీకాంత్ రెడ్డి, మధుకర్

వికారాబాద్ నియోజకవర్గ ప్రతినిధి అక్టోబర్ 31(ప్రజాబలం) వికారాబాద్ జిల్లా: మర్పల్లి మండలంహైదరాబాద్--రంగారెడ్డి--మహబూబ్‌నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అర్హులైన పట్టభద్రులందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని మర్పల్లి మండల బి ఆర్ ఎస్ పార్టీ మాజీ అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ మధుకర్కోరారు.ఈ మేరకు శనివారం మర్పల్లి తహసీల్దార్ మనోహర్ చక్రవర్తినిపార్టీ నాయకులతో కలిసి, నూతన పట్టభద్రుల ఓటరు నమోదు కోసం సేకరించిన సుమారు 60 ఫారం-18 దరఖాస్తులను అందజేశారు

ఈ సందర్భంగా పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియ, ఇప్పటివరకు నమోదైన ఓటర్ల వివరాలను ఎమ్మార్వోను అడిగి తెలుసుకున్నారు.

దీనికి స్పందించిన ఎమ్మార్వో మనోహర్ చక్రవర్తి మాట్లాడుతూ, ఇప్పటివరకు మర్పల్లి మండలంలో సుమారు 820 మంది

పట్టభద్రులు ఓటరు నమోదుకు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ఇంకా సుమారు 400 మంది వరకు దరఖాస్తులు వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి, మధుకర్ మాట్లాడుతూ.. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవడానికి అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఓటరు నమోదు ప్రక్రియపై మరింత అవగాహన కల్పించాలని, అర్హులైన పట్టభద్రులందరూ తమ పేర్లను నమోదు చేసుకునేలా సంబంధిత అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు.

ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ మోహన్ రెడ్డి ,మాజీ యూత్ అధ్యక్షులు మధుకర్ ,సీనియర్ నాయకులు మంగలి రమేష్, మాజీ కో ఆప్షన్ సోహెల్ మండల నాయకులు చంటి, ఆనంతి ,పాల్గొన్నారు

గోవిందపూర్ ప్రాథమిక హక్కులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

మోమినపెట్ సబ్ ఇన్స్పెక్టర్ భరత్,

వికారాబాద్ నియోజకవర్గ ప్రతినిధి అక్టోబర్ 31(ప్రజాబలం) వికారాబాద్ జిల్లా: మోమిన్ పెట్ మండలం గోవిందపూర్ గ్రామంలోప్రాథమిక హక్కులు చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కులమతాలకు అతీతంగా అందరూ కలిసి ఉండాలని మోమిన్ పేట్ ఎస్సై భరత్ కుమార్ అన్నారు శనివారం నాడు గోవిందపూర్ లో జరిగిన పౌర హక్కుల అవగాహన సదస్సులో అన్నారు ఈ సందర్భంగా డిప్యూటీ తాసిల్దార్ సురేష్ మాట్లాడుతూ ప్రతి పౌరుడు రాజ్యాంగం కల్పించిన హక్కులను తెలుసుకోవడం తో పాటు వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు మోమిన్ పెట్ ఎస్సీ బాలుర వసతి గృహం సంక్షేమ అధికారి తుల్జారామ్ గౌడ్ మాట్లాడుతూ బాల్యం పిల్లల హక్కు ఆడి పాడే వయసులో పిల్లలకు పెళ్లిళ్లు చేసి పేదోళ్లను చేస్తున్నారు రేఖ బొక్క రుద్రకముందే 30 ఏళ్లకే ముసలితనం విచ్చేస్తుంది తల్లిదండ్రుల గమనించండి మీ పిల్లల్ని విద్యావంతులం చేయండి ప్రభుత్వ పాఠశాలలో పై చదువులు చదువుకునే మంచి మంచి అవకాశాలు ఉన్నాయి వాటిని సద్వినియోగం చేసుకోండి నేటి బాలలే రేపటి భావి భారత పౌరులు బాల్యవివాహాలు ఎవ్వరు కూడా చేయకూడదు అధికారులు ఉన్నారు మనకు అండగా అందించు వార్త వారి అరికడతారు కాబట్టి18 సంవత్సరాలు నిండిన బాలికలకు వివాహము చేయాలని చిన్న పిల్లలను పనిలో పెట్టుకోకుండా బడికి పంపించాలని గ్రామంలో అందరూ కులమతాలకు అతీతంగా కలిసి మెలిసి ఉండాలని ఆయన అన్నారు ఈ సమావేశంలో స్థానిక సర్పంచ్ కృష్ణవేణి గోవింద్ పంచాయతీ కార్యదర్శి జగన్ రెడ్డి గ్రామ ప్రజలు పాల్గొన్నారు

సిద్దిపేట జిల్లాలో నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షా కేంద్రాల వద్ద 163 బి.ఎన్.ఎస్ సెక్షన్ అమలు

:సిద్దిపేటసిద్దిపేట జిల్లాలో జరగనున్న నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ 2026 పరీక్ష జరగనున్న నేపథ్యంలో,పరీక్ష కేంద్రం వద్ద శాంతిభద్రతల పరిరక్షణకు మరియు పరీక్ష ప్రశాంతంగా నిర్వహించేందుకు సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్ 163 బిఎన్ ఎస్ఎస్ 2023 సెక్షన్ ఉత్తర్వులు జారీ చేశారు. భారతీయ నాగరిక్ సురక్షా సంహిత సెక్షన్ 163 ప్రకారం, జిల్లాలోని పరీక్షా కేంద్రాలు అయిన సిద్దిపేట ప్రభుత్వ బాయ్స్ హై స్కూల్, సిద్దిపేట ప్రభుత్వ గర్ల్స్ హై స్కూల్, ప్రభుత్వ న్యూ హైస్కూల్ సిద్దిపేట, జడ్.పి.హెచ్.ఎస్ ఇంద్రనగర్ ఏ సెంటర్, సిద్దిపేట జడ్పిహెచ్ఎస్ ఇంద్ర నగర్ బి సెంటర్, తెలంగాణ మోడల్ స్కూల్ ముత్రాజ్పల్లి గజ్వేల్, ప్రభుత్వ బాయ్స్ హై స్కూల్ సంగాపూర్ రోడ్డు గజ్వేల్, తెలంగాణ మోడల్ స్కూల్ హుస్నాబాద్, హుస్నాబాద్ జడ్పీహెచ్ఎస్ బాయ్స్ స్కూల్ ఈ పరీక్ష కేంద్రాల చుట్టూ 500 మీటర్ల పరిధిలో ఐదుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది గుమిగూడటాన్ని నిషేధించారు.ఈ ఆంక్షలు పరీక్ష 01.11.2026 ఉదయం 6:00 గంటల నుండి సాయంత్రం 4:00 గంటల వరకు అమలులో ఉంటాయి.పరీక్ష కేంద్ర పరిసరాల్లో కర్రలు, రాళ్లు, ఆయుధాలు లేదా ఇతర ప్రమాదకరమైన వస్తువులు కలిగి ఉండటం నేరం. అలాగే, ఎగ్జామినేషన్ మెటీరియల్‌కు సంబంధించిన నిషేధిత కాగితాలను తీసుకెళ్లడం పూర్తిగా నిషేధం. పరీక్షలు జరిగే సమయంలో పరీక్షా కేంద్రాల సమీపంలోని అన్ని జిరాక్స్ సెంటర్లను తప్పనిసరిగా మూసివేయాలని కమిషనర్ ఆదేశించారు. ఈ ఉత్తర్వుల నుండి కింది వారికి మినహాయింపు ఉంటుంది:విధుల్లో ఉన్న పోలీస్ అధికారులు.విధుల్లో ఉన్న సైనిక సిబ్బంది.విద్యాశాఖకు చెందిన ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు.అంత్యక్రియల ఊరేగింపులు.విద్యార్థులు ఎటువంటి ఆందోళన చెందకుండా పరీక్షలు రాసేలా పోలీస్ స్టేషన్ల అధికారులు తగిన బందోబస్తు మరియు రక్షణ ఏర్పాట్లు చేయాలని పోలీస్ కమిషనర్ స్పష్టం చేశారు. ఈ ఉత్తర్వులను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోబడతాయని సిపి రష్మీ పెరుమాళ్ తెలియజేశారు.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com